
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 09.10.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 19 పేజీలు : 12, వెల : ₹ 5





# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## • చంద్రబాబు

# రాజధానికై ఆరాటం



*చంద్రబాబు సింగపూర్ లాంటి రాజధాని కడతాడో, కౌలాలంపూర్ లాంటి రాజధాని కడతాడో, బీజింగ్ లాంటి రాజధాని కడతాడో... అసలు ఏ రాజధాని లేకుండా చేస్తాడో గాని రాజధాని పేరుతో ఆయన చేస్తున్న యాగీ అంతా ఇంతా కాదు. రాజధాని పేరుతోనే పరిపాలన అంతా సాగిపోతోంది. రాష్ట్రంలో ప్రజా సమస్యలు గాలికి పోయాయి. రాజధాని ఒక్కటి కట్టేస్తే ఈ రాష్ట్ర ప్రజలు రోజుకు మూడు కాదు నాలుగు పూటలా తింటూ సుఖసంతోషాలతో గడుపుతారన్నట్లుగా వుంది చంద్రబాబు ఫీలింగ్.*

5వేల ఎకరాలలో కట్టగలిగే రాజధాని కోసం 33వేల ఎకరాల భూమిని లాక్కున్నాడు. అది కూడా పంటలు పండే మాగాణి భూమి. గరిక కూడా మొలవని మెట్ట భూములైతే ఎన్ని ఎకరాలు తీసుకున్నా బాధపడనవసరం లేదు. ఈ విధంగానన్నా అవి బాగుపడతాయని సరిపెట్టుకోవచ్చు. సేకరించిన 33వేల ఎకరాలు సరిపోవన్నట్లు సిఆర్‌డిఏ పరిధిని ఇంకా పెంచి ఇంకా భూమిని గుంజడానికి ప్రయత్నిస్తున్నారు.

భూసేకరణ పేరుతో భూమిని గుంజారు. రైతులకు ఒక్క రూపాయి ఇవ్వలేదు. స్థలం రూపంలో ఇస్తామన్నారు. ఆ స్థలాలు కూడా ఎప్పుడిస్తారో, ఎక్కడిస్తారో తేల్చలేదు. రాజధాని వస్తుందని కొందరు రైతులు ఎగేసుకుంటూ భూములిచ్చారు. భూసేకరణ అంతా పూర్తయ్యాక ఇప్పుడు చంద్రబాబు అసలు విషయం చెప్పాడు. రాజధానిలో రియల్ వ్యాపారానికి చంద్రబాబు తెరలేపాడు. రియల్ వ్యాపారం చేయబోతున్నట్లు ఆయనే ప్రకటించారు. స్విస్ ఛాలెంజింగ్ విధానంలో సింగపూర్ సంస్థలకు రాజధాని భూములను అప్పగించబోతున్నారు. అంటే పక్కగ్గా రాజధాని భూములతో జాయింట్ వెంచర్ చేయబోతున్నారు. ఈ జాయింట్ వెంచర్‌లో చివరిగా నష్టపోయేది భూములిచ్చిన రైతులే! ఎక్కువగా లబ్ది పొందేది అరకొర పెట్టుబడులు పెట్టిన వ్యాపారులు. ఈ కంపెనీలు చాలా తక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణంలో భూములను పొందబోతున్నాయి. రైతులకు మాత్రం ఎకరాకు 1200గజాలు మాత్రమే లభించనుంది. అమరావతి భూముల రేట్లను హైదరాబాద్ బంజారాహిల్స్‌లో వుండే రేట్లతో పోలుస్తున్నారు. హైదరాబాద్ స్థాయికి అమరావతి చేరాలన్నా, అక్కడి రేట్లు ఇక్కడ రావాలన్నా ఈ యుగంలో అయ్యే పనేనా? రాజధానిలో స్థలాలకు ఇప్పట్లో రేట్లు రావు... రైతుల కష్టాలు తీరవు. రాజధాని పేరుతో రైతులను వంచించినట్లే!

దసరా రోజు అమరావతి రాజదాని శంకుస్థాపన (మిగతా 10వ పేజీలో)

## • జగన్

# హోదాకై పోరాటం



*రాజకీయనాయకుడు ప్రజానాయకుడు కాగలిగేది ప్రజా సమస్యలపై సమర్ధవంతంగా పోరాడగలిగినప్పుడే... ఆ పోరాటాన్ని సమర్ధవంతంగా కొనసాగించగలిగినప్పుడే! రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షనేతగా ఉన్న వై.యస్. జగన్మోహన్ రెడ్డికి ఇప్పుడు అలాంటి అవకాశమే వచ్చింది. తనను తాను ప్రజా నాయకుడిగా తీర్చిదిద్దుకునే ఛాన్స్ ప్రత్యేకహోదా పాయింట్ రూపంలో లభించింది.*

రాష్ట్రంలో ఒకే సమయంలో రెండు అంశాలు చోటు చేసుకున్నాయి. అధికారపార్టీ నేత చంద్రబాబు రాజధాని శంకుస్థాపన ఏర్పాట్లలో మునిగివున్నాడు. వంద విమానాలు, వెయ్యి కార్లు అంటూ హంగామా చేస్తున్నారు. అయితే ప్రజలు ఈ సబ్జెక్ట్‌ను అంత సీరియస్‌గా తీసుకోవడం లేదు, సరికదా ఇంత ఆర్భాటపు శంకుస్థాపనపై వ్యతిరేకత కూడా వస్తుంది. "మింగను మెతుకు లేకుంటే, మీసాలకు సంపెంగనూనె" అన్నట్లు రాష్ట్రం దివాళా తీసుంటే రాజధాని శంకుస్థాపనకు ఇంత ప్రచారార్భాటం అవసరమా అనే విమర్శలు లేకపోలేదు. సింగపూర్ లాంటి రాజధానే కావాలని రాష్ట్ర ప్రజలంతా కోరుకోవడం లేదు. పంటలు పండే భూములను పాడు చేస్తూ, రైతులను పాడెక్కిస్తూ ఇలాంటి రాజధానిని కట్టడం అవసరమా అని ప్రశ్నించేవాళ్లను రోజూ చూస్తూనే వున్నాం. సింగపూర్ లాంటి రాజధాని వల్ల చంద్రబాబుకు వారి మంత్రులకు ప్రయోజనం వుందేమో గాని రాష్ట్ర ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదు.

ఈరోజు రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రాజధాని కన్నా ముందు కావాల్సింది ప్రత్యేకహోదా! విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగింది. దీనిని కొంత భర్తీ చేయడానికన్నట్లుగా ఏపికి ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంటులో ప్రకటించారు. కాంగ్రెస్, బీజేపీలతో సహా మెజార్టీ పార్టీలు దీనికి మద్దతు పలికాయి కూడా! 2014 ఎన్నికలలో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఎన్నికల ప్రచారంలో ఏపికి జరిగిన అన్యాయం పట్ల తీవ్రమైన బాధను వ్యక్తం చేసిన నరేంద్ర మోడీ ప్రధాని కావడంతో ఏపికి ప్రత్యేకహోదా ఇవ్వడంతో పాటు ఇంకా అనేక ప్రయోజనాలు అందుతాయని ఆశించాము. కాని తీరాచూస్తే పార్లమెంటులో హామీ ఇచ్చిన ప్రత్యేకహోదాను ఇవ్వలేదు. దీనికి రాజకీయ కారణాలు చాలానే వున్నట్లున్నాయి.

చంద్రబాబు ప్రత్యేకహోదా గురించి కేంద్రంపై ఏ మాత్రం ఒత్తిడి చేయడం లేదు. ఆయన తీరు చూస్తే కేంద్రం ప్రత్యేకహోదా (మిగతా 10వ పేజీలో)

## వేడుకగా 'స్వచ్ఛ' సాంబమూర్తి 'సంగీత' పండుగ



(వివరాలు 6, 7, 11 పేజీలలో)



# పోలేరమ్మ... చల్లగా చూడమ్మా!

నెల్లూరుజిల్లా వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర వైభవంగా జరిగింది. బుధవారం సాంప్రదాయబద్ధంగా జాతర ప్రారంభమైంది. గురువారం అమ్మవారి దర్శనం కోసం లక్షలాది సంఖ్యలో భక్తులు పోటెత్తివచ్చారు. వెంకటగిరి పట్టణం ఎటుచూసినా జనజాతరగా కనిపించింది. జాతర సందర్భంగా మద్యపానం, జంతు బలుల నిషేధం గురించి ముందుగానే ప్రచారం చేసినప్పటికీ ఎవ్వరూ వాటిని అరికట్టలేకపోయారు. ముందురోజు అమ్మ పుట్టినిల్లు కుమ్మరివీధిలోని కుమ్మరి ఇంట విగ్రహ రూపకల్పనకు ఏర్పాట్లు చేసారు. కుమ్మరి కుటుంబీకులు అమ్మవారి మట్టి విగ్రహాన్ని తయారుచేసి అనంతరం పోలేరమ్మ ప్రతిమను జీనిగలవారివీధిలోని అత్తవారిల్లు అయిన చాకలింటి వద్ద వుంచి, అమ్మవారి ఆలయం వద్ద అమ్మవారిని దర్శించుకునేందుకు వీలుగా బారికేడ్‌లను ఏర్పాటు చేసారు.



అమ్మవారిని విరుపం చేసేందుకు తీసుకువెళ్లే మార్గమైన కైవల్యానదిలో అనుకూలంగా రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లన్నింటిని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఛైర్‌పర్సన్ దొంతు శారద, భక్తజన సేవా కమిటి అధ్యక్షుడు తాండవ రాజారెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

*సాంప్రదాయం:* వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరలో కీలక ఘట్టమైన అమ్మవారి విగ్రహం తయారీ బుధవారం సాయంత్రానికి పూర్తయ్యింది. కుమ్మరి కుటుంబీకులు తిరుమల, శివశంకర్ అమ్మవారి విగ్రహాన్ని తయారు చేశారు. ఈ విగ్రహం తయారీ తర్వాత ఆ కుటుంబానికి చెందిన ఆడపడుచులు అమ్మవారికి సాంప్రదాయంగా పసుపు, కుంకుమ, పండ్లు, చీర, పూలు సమర్పించారు. విగ్రహం తయారీ పూర్తయ్యాక అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. పుట్టినింటి వద్ద అమ్మవారికి పూర్తి స్థాయిలో అంకరణ చేయకుండా నిరాడంబరంగా అత్తగారిల్లు వున్న జీనిగల వారివీధిలోని చాకలింటి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అమ్మవారిని అలంకరించి కళ్లు, దిష్టిచుక్క పెట్టారు.



### జగన్ దీక్షకు మద్దతుగా

# చెవిలో పూలతో వినూత్న నిరసన

ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేకహోదా కోరుతూ గుంటూరులో వైకాపా అధ్యక్షులు వై.యస్. జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న దీక్షకు మద్దతుగా నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపు మేరకు నెల్లూరు రూరల్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ నెల 8వ తేదీన నెల్లూరు వేదాయపాళెం సెంటర్‌లో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. అందరూ చెవుల్లో పూలు పెట్టుకుని మానవహారంగా ఏర్పడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. పెద్ద సంఖ్యలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు, విద్యార్థులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, తిరుపతి ఎంపి వరప్రసాద్, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేకహోదా కోసం జగన్ చేస్తున్న పోరాటానికి వెన్నుదన్నుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు తాటి వెంకటేశ్వర్లురావు, లేబూరు పరమేశ్వరరెడ్డి, జి.మధుసూధనరెడ్డి, బొబ్బల శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

# రొట్టెల పండుగను విజయవంతం చేయండి

మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే రొట్టెల పండుగను ఎలాంటి అవాంతరాలు లేకుండా విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ యం.జానకి అధికారులను ఆదేశించారు. సోమవారం నెల్లూరు దర్గామిట్టలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రొట్టెల పండుగ కార్యక్రమం, నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు నెల్లూరు దర్గామిట్ట బారాషహీద్ దర్గాలో రొట్టెలపండుగను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. ఈ పండుగకు జిల్లా నుంచే కాకుండా దేశవిదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తారని, వారి కోసం దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు, మరుగుదొడ్లు, మంచినీటి కొళాయిలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని అదనంగా జనరేటర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. భక్తులు క్రమపద్దతిలో దర్గాను దర్శించుకునేలా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. బారాషాహిద్ దర్గా పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా పారిశుద్ధ్య కార్యక్రమాలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. నెల్లూరు చెరువు వద్ద స్త్రీ, పురుషులకు వేర్వేరుగా బారికేడ్లు, పడవలతో గజఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. అయిదు రోజుల పాటు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. వైద్యశిబిరం, మైక్ సిస్టం, పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ పివివిఎస్ మూర్తి, ఆర్డీవో వెంకటేశ్వర్లు, పోలీసు అధికారులు, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ హైదర్‌అలీ, టూరిజం అధికారి కె.నాగభూషణం, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వేడుకగా "అంతరిక్ష నడక"



ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ఆదివారం షార్‌లో వేడుకగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సూళ్లూరుపేటలో 'అంతరిక్ష నడక' కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి షార్ సహనిర్దేశకులు టి.సుబ్బారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అంతరిక్ష వారోత్సవాల గురించి, రాకెట్ ప్రయోగాలు, కక్ష్యలోకి ఉపగ్రహాలు ప్రవేశపెట్టడం, వాటి వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. నడకలో పాల్గొన్న విద్యార్థులకు అంతరిక్ష వారోత్సవాల పేరుతో ఉన్న టి-షర్టులను అందజేశారు. రాకెట్లు, భాస్కర, ఆర్యభట్ట, ఐఆర్‌ఎన్‌ఎస్‌ఎస్ ఉపగ్రహాల నమూనాలను ప్రత్యేక వాహనాల్లో ప్రదర్శనగా తీసుకొచ్చారు. నడకలో పాల్గొన్న పాఠశాల యాజమాన్యాలకు జ్ఞాపికలు అందజేశారు. వారోత్సవాల కమిటీ ఛైర్మెన్ విజయసారధి, పిఅండ్‌పివో విశ్వనాథ శర్మ, శ్రీహరికోట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని మంజుల తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌బాల్స్‌తో దోమలపై సమరం

నెల్లూరు నగరంలోని 10వ డివిజన్ లోని రామచంద్రాపురం, కుసుమ హరిజనవాడ ప్రాంతాలలో నెల్లూరు నగర ఎమ్మెల్యే డా॥ పి. అనిల్‌కుమార్‌యాదవ్ పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగరంలో వర్షాల వల్ల, అనేక ప్రాంతాల్లో పారిశుద్ధ్యం సరిగా లేక పోవడం వల్ల మురుగునీరు రోడ్లపైకి చేరడంతో దోమలు వ్యాప్తిచెంది డెంగ్యూ లేదా ఇతర అనేక రకాలైన జ్వరాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై అనేక పర్యాయాలు కార్పొరేషన్ అధికారులకు తెలియజేయడం జరిగిందని, యుద్ధ ప్రాతిపదికన ఎక్కువ సంఖ్యలో పారిశుద్ధ్య కార్మికులను తీసుకుని నగరంలోని అన్ని ప్రాంతాల్లో చెత్తను పూర్తిగా తొలగించాల్సిందిగా గొంతు చించుకుని అధికారులకు చెప్పడం జరిగిందని, కాని అధికారుల్లో ఎటువంటి మార్పు లేదని, ఏదో మొక్కుబడిగా చేయాలి కాబట్టి పారిశుద్ధ్య పనులను చేయిస్తున్నారన్నారు. అందువల్ల మావంతు ప్రయత్నంగా నెల్లూరు నగరంలో వున్న అనేక ప్రధాన కాలువల్లో, ఖాళీ స్థలాల్లో నిలువ వున్న నీటిలో ఆయిల్‌బాల్స్ వేసి దోమల నిర్మూలనకు కృషి చేస్తామన్నారు. ప్రజల సహకారంతో వారి ఇళ్ల వద్ద వున్న కాలువల్లో కిరోసిన్‌ను ఉపయోగించి దోమల ఉత్పత్తిని, వ్యాప్తిని అరికట్టేందుకు పూనుకుంటామన్నారు. ఏ ప్రాంతానికి పర్యటనకు



పోయినా పందులు, కుక్కల సమస్య అధికంగా వుందని, ఈ విషయమై కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ఎటువంటి స్పందన లేదన్నారు. కేంద్రమంత్రి వెంకయ్య నాయుడు అయినా ఎన్ని ఇబ్బందులు వున్నా కూడా అప్పుడప్పుడు సొంత జిల్లాపై ప్రేమతో నెల్లూరుకు వచ్చి కనిపించి వెళుతుంటారని, కానీ మన జిల్లా మంత్రి మాత్రం కన్పించడం లేదని, ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అనుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, దేవరకొండ అశోక్, వైయస్సార్‌సీపీ బిసి సెల్ నగర అధ్యక్షులు ఉప్పాల శేషగౌడ్, వి.శ్రీహరి రాయల్, గోతం బాలకృష్ణ, గోవిందరాజు, రాజా, వెంకటరమణ, పత్తి చంద్రశేఖర్, దార్ల వెంకటేశ్వర్లు, వంగాల శ్రీనివాసులురెడ్డి, పోలంరెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి ఖోఖో విజేతలు నెల్లూరు జట్లు

రాష్ట్ర స్థాయి ఖోఖో విజేతలుగా నెల్లూరుజట్లు నిలిచాయి. "యువతరంగం-2015"లో భాగంగా నెల్లూరు డికెడబ్ల్యు ప్రభుత్వ కళాశాలలో రెండురోజులుగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ఆదివారం ముగిసాయి. ఈ పోటీల్లో 13జిల్లాల జట్లు పాల్గొన్నాయి. మహిళల విభాగంలో నెల్లూరు, విజయనగరం జట్లు తలపడగా నెల్లూరు జట్టు విజయం సాధించింది. సెమీఫైనల్స్‌లో గెలుపొందిన ప్రకాశం, నెల్లూరు జట్లు ఫైనల్స్‌లో నువ్వా, నేనా అన్నట్లు తలపడ్డాయి. నెల్లూరు జట్టు 12పాయింట్లు సాధించగా, ప్రకాశం జట్టు 8పాయింట్లు సాధించింది. దీంతో నెల్లూరు జట్టు విజేతగా నిలిచింది.

పురుషుల విభాగంలో ఆల్‌రౌండర్‌గా విడవలూరు ప్రభుత్వ కళాశాలకు చెందిన విద్యార్థి హరీష్, మహిళల విభాగంలో డికెడబ్ల్యు ప్రభుత్వ కళాశాల విద్యార్థిని జయలక్ష్మి నిలిచారు. వీరికి క్రీడాప్రాధికార సంస్థ రూ.5వేలు చొప్పున నగదు బహుమతులు అందించారు.

# కిషోర్స్ బంగారు రత్నాలు

స్పెల్‌బీ 2014-15 అంతర్జాతీయ పోటీ పరీక్షల్లో డాక్టర్ కిషోర్స్ రత్నం స్కూల్ విద్యార్థులు స్వర్ణ పతకాలను సాధించారు. నెల్లూరు సరస్వతీనగర్‌లోని డాక్టర్ కిషోర్స్ రత్నం రేస్ ఇంటర్నేషనల్ విద్యార్థులు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయిలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. రెండవ తరగతికి చెందిన సి.జాహ్నవి మెరిట్ ప్లస్‌ను, పి.ప్రణీతసాయి మెరిట్‌ను, 5వ తరగతికి చెందిన పి.శ్రీధర్ పార్టిసిపేషన్ సర్టిఫికేట్‌ను కైవసం చేసుకోగా, 2వ తరగతికి చెందిన సి.జాహ్నవి జాతీయ స్థాయిలో విజయం సాధించింది. రాష్ట్ర స్థాయిలో సి.జాహ్నవి, పి.హన్సికా



రెడ్డి, ఎన్.శ్రీహితారెడ్డి, కె.హైందవి, ఎంపిఎం కార్తికేయ టాపర్స్‌గా నిలిచారు. ఈ విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ డా॥ కిషోర్, జనరల్‌మేనేజర్ రామ్మూర్తినాయుడు అభినందించారు.

# మహిమలూరుకి మహర్దశ



## సొంతూరిని దత్తత తీసుకున్న సతీష్‌రెడ్డి

కన్నతల్లి, జన్మభూమి... మనం ఎంత గొప్పవాళ్ళమై ఏంచేసినా ఈ ఇద్దరి ఋణం తీర్చుకోలేము. అయితే మన ఊరు, మన మనుషులు అన్నాక ఆ ఊరికి ఏదో ఒకటి చేయడం మానవతాధర్మం. వివిధ రంగాల్లో అభివృద్ధి చెంది ఉన్నత స్థానాల్లో ఉన్న చాలామంది ఇటీవల కాలంలో తమ సొంత గ్రామాలను దత్తత తీసుకుంటూ అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నారు. ఈ పరంపరలోనే మన నెల్లూరీయులు గర్వించదగ్గ శాస్త్రవేత్త, కేంద్ర రక్షణశాఖ మంత్రి శాస్త్రీయ సలహాదారుడు గంగ్ర సతీష్‌రెడ్డి తన స్వగ్రామమైన ఆత్మకూరు మండలంలోని మహిమలూరు గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల మహిమలూరుకు వచ్చిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి కామినేని శ్రీనివాస్ సతీష్‌రెడ్డి చేస్తున్న ఈ మంచి పనిని కొనియాడారు. ఆయనను మరో అబ్దుల్ కలాంగా అభివర్ణించారు. క్షిపణుల రంగంలో ఉన్నత సేవలు అందించిన సతీష్‌రెడ్డి సొంత ఊరికి తనవంతు సాయం చేయడంలో ఆదర్శప్రాయుడన్నారు. ఉన్నత పాఠశాలకు కంప్యూటర్లు, డిజిటల్ ప్రొజెక్టర్ సమకూర్చారని తెలిపారు. మహిమలూరులో వెంకటేశ్వర ఆలయం, సాయిబాబా మందిరం నిర్మించి ఆధ్యాత్మిక సేవ చేశారని తెలిపారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా పుట్టి పెరిగిన ఊరు దత్తత తీసుకోవడం మరింత సేవలు అందించేలా చేస్తాయన్నారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టే కార్యక్రమాలు అభినందనీయమని, ప్రజలను అభివృద్ధి చేసేందుకు నూతన పథకాలు ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు. నెల్లూరు జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ మహిమలూరు గ్రామాభివృద్ధికి జిల్లా పరిషత్ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. జిల్లా కలెక్టర్ యం.జానకి మాట్లాడుతూ స్మార్ట్ విలేజ్ కింద మహిమలూరును సతీష్‌రెడ్డి దత్తత తీసుకున్నట్లు తెలిపారు.

# రక్తమిచ్చి స్ఫూర్తి నిచ్చారు

## కలెక్టర్ జానకి, జేసీ ఇంతియాజ్‌ల రక్తదానం



నెల్లూరు మద్రాసుబస్టాండ్ సమీపంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో ఏర్పాటు చేసిన జాతీయ స్వచ్ఛంధ రక్తదాన వారోత్సవాల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ యం.జానకి, జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ రక్తదానం చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం పట్ల ప్రజల్లో వున్న అపోహలను తొలగించాలని సూచించారు. రక్తదానంపై అపోహలు, అవగాహన లేమి కారణంగా దేశ జనాభాలో కేవలం 0.8శాతం మంది మాత్రమే రక్తదానం చేస్తున్నారన్నారు. గత ఆరు నెలల్లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి నిర్దేశించిన లక్ష్యాల్లో 50శాతం మేర రక్తాన్ని సేకరించి ముందంజలో వుందన్నారు. జాతీయ రక్తమార్పిడి పితామహుడిగా పేరొందిన డాక్టర్ జోలి జన్మదినాన్ని పురస్కరించుకుని అక్టోబర్ నెల 1వ తేదీ నుంచి వారం రోజుల పాటు జాతీయ స్వచ్ఛంధ రక్తదాన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్వరలో ఆత్మకూరు, కావలి, గూడూరుల్లో రక్త సేకరణ, స్క్రీనింగ్ యూనిట్లను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రక్తనిధి కన్వీనర్ డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ 2015-16లో 79కార్యక్రమాల ద్వారా 9565 యూనిట్ల రక్తాన్ని సేకరించామని, దానిని 14,804 మందికి దానం చేశామని, 1227మందికి ఉచితంగా రక్తాన్ని అందించినట్లు వివరించారు. ఈ సందర్భంగా రక్తదాతలు, పలు స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి చంద్రమౌళి, జిల్లా విద్యాశాఖాధికారి డి.ఆంజనేయులు, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంధ సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్రీ దత్తసాయి భరద్వాజ మందిరంలో విజయదశమి ఉత్సవాలు

విజయదశమి పర్వదినాన్ని, శ్రీ సాయిబాబా 97వ మహాసమాధిని పురస్కరించుకుని నెల్లూరు కొండాయపాళెం గేటు వద్ద వున్న రవీంద్రనగర్ 2వ వీధిలోని శ్రీ దత్తసాయి భరద్వాజ మందిరంలో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా 21వ తేది ఉదయం 6 గంటలకు స్వామివారికి కాకడహారతి, 8 గంటలకు రుద్రాభిషేకం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు హారతి, రాత్రి 9 గంటలకు శేజ్‌హారతి నిర్వహిస్తారు. 22న శ్రీ సాయిబాబా మహాసమాధి మహోత్సవంలో భాగంగా ఉదయం 6 గంటలకు కాకడహారతి, 8 గంటలకు అభిషేకం, 9 గంటలకు ఉభయకర్తల పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, అనంతరం 1 గంటకు అన్న సంతర్పణ వుంటుంది. సాయంత్రం 6గంటలకు స్వామివారికి హారతి, రాత్రి 9 గంటలకు శేజ్‌హారతి నిర్వహిస్తామని మందిరం నిర్వాహకులు పేర్కొన్నారు.



## ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి

# 13 నుంచి నవరాత్రి ఉత్సవాలు

సింహపురి గ్రామదేవత, నెల్లూరు నగరంలోని మూలాపేటలో చెరువు ఒడ్డున వెలసిన చల్లనితల్లి..శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ నెల 13 నుంచి 22వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. అమ్మవారి ఉత్సవాల కోసం ఆలయ కార్యనిర్వహణాధికారి ఏ.వి శ్రీనివాసులురెడ్డి నేతృత్వంలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా, ప్రతినిత్యం ఉదయం 6.30 గంటలకు అభిషేకం, సాయంత్రం 6 గంటలకు పూలంగిసేవ, రాత్రి 8 గంటలకు పల్లకీసేవ నిర్వహిస్తారు.



### ఎంతో ప్రాచీన చరిత్ర వున్న ఆలయం :

నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం ఎంతో ప్రాచీనమైనది. ఈ ఆలయం నాటి కాలంలో ఎర్రని బొంతరాళ్ళతో అత్యంత అద్భుతంగా నిర్మించారు. భక్తుల పాలిట కల్పవల్లి, కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు ప్రసిద్ధి. ఎంతో ప్రాచీన చరిత్ర వున్న నెల్లూరు నగరంలో క్రీ.శ 10, 11 శతాబ్ధాల నాటికే ఈ ఆలయం వున్నట్లు, అప్పటినుంచే అమ్మవారు గ్రామదేవతగా ప్రసిద్ధి చెందినట్లు చరిత్ర చెప్తోంది. అప్పట్లో నెల్లూరు చెరువును స్వర్ణాల చెరువు అని వ్యవహరించేవారు. ఈ చెరువును కాకతి గణపతిదేవుడు నిర్మించారు. ఈ ఆలయంలోని స్తంభాలపై తెలుగు, తమిళ, దేవనాగరి భాషల్లో వున్న శాసనాలు దేవాలయ నిర్మాణానికి సంబంధించిన చారిత్రక అంశాలను తెలుపుతున్నాయి. ఈ ఆలయంలో ప్రతి ఏటా జరిగే నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కరుణాకటాక్షాలకు పాత్రులవుతుంటారు.

### ప్రతినిత్యం కన్నుల పండువగా అలంకారాలు :

ఈ ఉత్సవాల సందర్భంగా శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి నిర్వహించే విశేషాలంకరణలు భక్తులందరికీ కన్నుల పండువగా వుంటాయి. 13న ఉదయం 10 గంటలకు శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి అలంకారాన్ని ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. 14వ తేది నుంచి ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి ఇలా విశేష అలంకారాలను నిర్వహిస్తారు. 14వ తేది సాయంత్రం శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారం, 15న శ్రీ గజలక్ష్మీ అమ్మవారి అలంకారం, 16న శ్రీ సరస్వతీదేవి అలంకారం, 17న శ్రీ భవాని అమ్మవారి అలంకారం, 18న శ్రీ దుర్గాదేవి అమ్మవారి అలంకారం వైభవంగా నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా, 19వ తేది సాయంత్రం శ్రీ చండీ అమ్మవారి అలంకారం, 20న శ్రీ లలితా పరమేశ్వరి అలంకారం, 21న నవమి సందర్భంగా శ్రీ మహిషాసురమర్ధిని అమ్మవారి అలంకారం నిర్వహిస్తారు. 22న విజయ దశమిని పురస్కరించుకుని వేడుకగా శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి అలంకారం నిర్వహిస్తారు.







## 'ప్రభా'తం

# అధోగతిలో అన్నదాత

**అందరికీ అన్నం పెట్టే అన్నదాతలు సమస్యల సుడిలో పడుతున్నారు. అనేక మంది అసహాయులైన అన్నదాతలు చివరికి ఆత్మహత్యల దారులు వెదుక్కుంటున్నారు. ఇదెంతో బాధాకరం.. విచారకరం. ఇకనైనా, రైతుల పట్ల ప్రభుత్వాల దృక్పథాలు మారాలి. వారి సమస్యలు పరిష్కరించి, వారిని అన్నివిధాలా ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలి. రైతుల్లో పేరుకుపోతున్న నిర్వేదాన్ని తొలగించి, దేశంలో ఎక్కడా ఏ ఒక్క రైతూ ఆత్మహత్య చేసుకోకుండా వుండేలా చూడాలి.**

దేశంలోనూ, రాష్ట్రంలోనూ అన్నదాతల స్థితి నానాటికీ అధోగతికి చేరుకుంటోంది. అనేకమంది బీదాబిక్కీ రైతన్నల దుస్థితి మరింత హృదయవిదారకంగా వుంటోంది. ఆరుగాలం కష్టించి పనిచేసి అందరికీ అన్నం పెట్టే రైతన్నకు పట్టెడు మెతుకులు కూడా కరువవుతుండడం దారుణం.. దయనీయం. అన్నదాతల బతుకుపుస్తకం ఏ పేజీ చూసినా అంతా కష్టాలమయం.. కన్నీటి చారికలమయంగానే వుండడం ఎంత బాధాకరం. నిస్సహాయ రైతులు తీవ్రమైన నిర్వేదంతో చివరికి ఆత్మహత్యలు చేసుకొంటుండడం ఎంత విచారకరం!.. దేశంలో నేటికీ ఆ మరణమృదంగాలు.. మృత్యుఘంటికలు మోగుతూనే వుండడం ఎంత విషాదకరం?.. తరచూ దేశంలో ఎక్కడో ఒక చోట నిత్యం రైతుల ఆత్మహత్యలు కనిపిస్తూనేవున్నాయి. ఇవన్నీ చూస్తుంటే, దేశవ్యాప్తంగా వ్యవసాయం రంగం సంక్షోభంలో పడిపోతున్నదా అనిపిస్తోంది. ఏడాదికేడాది రైతన్నల ఆత్మహత్యల సంఖ్య గణనీయంగా పెరిగిపోతూనే వుంది తప్ప తగ్గిపోవడమన్నదే కనిపించకపోవడం అందరినీ కలచివేస్తోంది. పొద్దస్తమానం పొలం పనులు చేసినా, చివరికి ఏ ప్రకృతి విపత్తో వచ్చి, చేతి కందాల్సిన పంట కాస్తా నోటిదాకా వచ్చే పరిస్థితి లేకుండా పోతోంది. వస్తే వరద, లేకుంటే కరువు అన్నట్లుగా, వస్తే అకాల వర్షం..లేకుంటే వర్షాభావం. సేద్యం చివరికి రైతన్నల కష్టం మీద కాక..వారి అదృష్టం మీదనే ఆధారపడే దుస్థితి దాపురిస్తోంది.

అనేకప్రాంతాల్లో సాగునీటి వసతులు సక్రమంగా లేకపోవడంతో వర్షాల మీదనే ఆధారపడిన రైతులు వరుణుడి కరుణ కోసం నిత్యం ఆశనిరాశల మధ్య ఊగిసలాడుతూనే వున్నారు. ఖరీఫ్-రబీ అనే రెండు వ్యవసాయ సీజన్లు వున్నా, ఒకటి అనావృష్టితో, రెండోది అతివృష్టితో వుంటే ఇక రైతుల పరిస్థితి ఎంత దయనీయమో!.. దుక్కి దున్ని, నాట్లు వేసి, విత్తనాలు మొలకలెత్తేవరకూ ఆశతో ఎదురుచూసి, పంట పండేదాకా కళ్ళల్లో వత్తులు పెట్టుకుని నిరీక్షించే రైతన్న, ఆ పంట బాగా పండాలని చేసే రుణాలతో పాటు, కుటుంబపోషణకు, పిల్లల బాగోగులకు చేసే అప్పులు.. అన్నీ కలిసి తడిసి మోపెడవుతున్నాయే తప్ప, రైతన్నకు కంటి నిండా నిద్ర ఎక్కడిది?..ఎప్పుడూ ఏదో ఒక ఆందోళనే. ఏదో ఒక ఆవేదనే... ఇంకా ఎంతకాలమిలా?..

పెట్టుబడికి-దిగుబడికి మధ్య లంకె కుదరకపోవడం, పంటలకు తగ్గ గిట్టుబాటు ధర లేకపోవడం, పంటలు నిల్వచేసుకునేందుకు సరైన వసరులు లేకపోవడం.. ఇంకా నకిలీ విత్తనాలు, పురుగుమందులు, మధ్యవర్తుల మాయాజాలం..ఒకటా రెండా రైతన్నకు ఎటుచూసినా కష్టాలే..అన్నీ శాపాలే. వ్యవసాయంతో రైతులు నష్టపోకుండా సరైన విధానాలు ఆచరణలోకి రాకపోవడం, రైతుల సమస్యలు తీరుస్తామని మాటలు చెప్పేవారే తప్ప చేతల్లో ఆచరించేవారు లేకపోవడం.. ఇలాంటివన్నీ రైతన్నలను నిరాశలోకి నెడుతూనే వున్నాయి. మన రాష్ట్రంలోనూ రైతుల ఆత్మహత్యల సంఖ్య నానాటికీ పెరిగిపోతూనే వుంది. సన్న చిన్నకారు రైతులు అప్పుల బాధలు తట్టుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక, పంటలు పండించుకోలేక నానా బాధలు పడుతున్నారు. అక్కడక్కడా పేద రైతులు అసహాయస్థితిలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 2014 నాటికే దేశవ్యాప్తంగా దాదాపు మూడు లక్షల మందికి పైగానే రైతన్నలు బలవన్మరణాలు పొందినట్లు గణాంకాలు చెప్తున్నాయంటే దేశంలో రైతుల పరిస్థితి ఎంత దయనీయంగా వుందో తేటతెల్లమవుతుంది. ఇక రెండు తెలుగురాష్ట్రాల్లోనూ గత ఏడాది 1979 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు అంచనా. గత ప్రభుత్వాల ఏలుబడిలో వ్యవసాయరంగం కుదేలైపోయి రైతన్నల బతుకులు అస్తవ్యస్తంగా మారాయి. కొత్త ప్రభుత్వాలు వచ్చి, రుణాలు మాఫీ, సాగునీటి వనరుల కల్పన వంటి విషయాల్లో కొంతలో కొంత మెరుగైన చర్యలు తీసుకుంటున్నప్పటికీ, నేటికీ అనేక ప్రాంతాల్లో రైతులు దయనీయస్థితిలోనే వున్నారు. అన్నదాతల సమస్యలకు మూలకారణాలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు విజ్ఞులైనవారు ఎన్నో సిఫార్సులు చేస్తూనే వున్నా, పట్టించుకుంటున్నవారు అంతంతమాత్రమే. ఒకవైపు పంటలు చేతికందక, మరోవైపు రుణాలు చెల్లించలేక, నిత్యావసర ధరలు పెరిగిపోయి కుటుంబాలను పోషించుకోలేక, సరైన విద్య, వైద్యం వంటివి అందక నిత్యం అనేకమంది రైతన్నల కుటుంబాలవారు పడే వేదనారోదనలు వర్ణనాతీతం.

ఇకనైనా, అన్నదాతల పట్ల ప్రభుత్వాల దృక్పథాలు మారాలి. వారిని అన్నివిధాలా ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ముందుకు రావాలి. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అన్ని ప్రాంతాల్లో అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తల బృందాలు సమాయత్తం కావాలి. పంటలకు మద్దతు ధర ఇచ్చి రైతాంగాన్ని ప్రోత్సహించాలి. మధ్యవర్తుల మాయాజాలాన్ని నివారించాలి. వ్యవసాయం పట్ల రైతుల్లో పేరుకుపోతున్న నిర్వేదాన్ని తొలగించి కొత్త ఉత్సాహాన్నిచ్చే విధానాలను సత్వరం అమలు చేయాలి. ప్రతి రైతూ ధీమాగా..హాయిగా బతికేవిధంగా వారిని అన్నివిధాలా ఆదుకోవాలి. దేశంలో ఎక్కడా ఏ ఒక్క రైతూ ఆత్మహత్య చేసుకోకుండా వుండేలా చూడాలి. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న నేటి కాలంలో, రైతన్నలకు అడుగడుగునా చేయూతనిచ్చే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి, వారిని మరింతగా చైతన్యవంతం చేయాలి.

అందరికీ అన్నం పెట్టే రైతన్న ముఖంలో ఏనాటికీ తరిగిపోని సంతోషం తొణికిసలాడేలా వారి జీవితాలను కళకళ లాడించాలి. అహరహం కష్టించే రైతన్నలకు మేమున్నామంటూ అందరూ భరోసా ఇవ్వాలి. ఖచ్చితమైన, సమగ్రమైన కార్యాచరణ ప్రణాళికతో రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు నడుము బిగించాలి. చిత్తశుద్ధితో, సరైనా ప్రణాళికలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కదిలిరావాలి. రాజకీయాలకతీతంగా అందరూ కలసి రావాలి. రైతన్నలంతా హాయిగా బతకగలిగే పరిస్థితిని తీసుకు రావాలి. అప్పుడే, రైతు ముఖంలో సంతోషం చిగురిస్తుంది..రైతన్నల జీవితాల్లో ఆనందం వెల్లివిరుస్తుంది.

---

## కె.వి.నాగేశ్వరరావుకు డా॥ అక్కినేని స్మారక అవార్డు



నెల్లూరుకు చెందిన కవి, రచయిత, నటుడు, రెవెన్యూ ఉద్యోగి కె.వి. నాగేశ్వరరావుకు డా॥ అక్కినేని స్మారక అవార్డు లభించింది. విజయవాడకు చెందిన మానస సాహిత్య సాంస్కృతిక అకాడమి ఈ అవార్డును ప్రదానం చేసింది. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 4న నాగేశ్వరరావుకు సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ హేమసుందర్, సంస్థ అధ్యక్షులు బ్రహ్మానందరావు తదితరులు ఈ అవార్డును ప్రదానం చేశారు. నాలుగు దశాబ్దాలుగా సాహితీ రంగానికి విశేష సేవలందించినందుకు గాను ఆయనను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

### రాజేశ్వరమ్మ గుడి వద్ద
## దుకాణాల తొలగింపు

నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ముందున్న చెప్పుల స్టాండ్, పూలు, పూజాసామాగ్రి దుకాణాలను 6వ తేదీ 5వ నగర సిఐ సుబ్బారావు పర్యవేక్షణలో తొలగించారు. కార్పొరేటర్ దొడ్డపనేని రాజానాయుడు, తెలుగుదేశం నాయకులు మేకల రాజేంద్ర పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. గుడి కనిపించకుండా ఈ దుకాణాలు ఆక్రమించి వున్నాయని, కాబట్టే తొలగించాల్సి వచ్చిందని అధికారపార్టీ వాళ్ళు చెబుతున్నారు. కాని గతంలో వైకాపా నాయకుల అండతో ఈ దుకాణాలు పెట్టుకుని వున్నారని, కాబట్టే తొలగించారనేది స్థానిక టాక్.

# విద్యుత్ కాటుకు ముగ్గురు బలి

**విధి వంచితులు**

విధిని ఎవ్వరూ తప్పించుకోలేరు. మరమ్మత్తులు చేస్తున్న ముగ్గురు విద్యుత్ ఉద్యోగులు కరెంట్‌షాక్‌కు బలయ్యారు. ఈ సంఘటనతో ఆయా కుటుంబాల్లో చీకట్లు నిండుకుని తీరని విషాదం నెలకొంది. నెల్లూరుజిల్లా మర్రిపాడు మండలం కదిరినేనిపల్లి వద్ద 3వ తేదీ విధి నిర్వహణలో గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు వెళ్లిన ముగ్గురిని మృత్యువు కబళించింది. గాలి వానకు తెగిన ప్రధాన విద్యుత్ తీగకు మరమ్మత్తులు చేసి సరఫరా ఇచ్చేందుకు పనిలో దిగిన లైన్‌మెన్ మన్నేపల్లి వేణు(36), వాచ్‌మెన్ తాటికొండ ప్రసాద్(20), అసిస్టెంట్ ఇంద్ల అశోక్(21) మృతి చెందారు. లైన్‌మెన్ వేణుకు భార్య రమ, కుమార్తెలు జ్యోతి, పూజిత, కుమారుడు లోకేనాథ్ అనే చిన్నారులు వున్నారు. సంఘటనా స్థలంకు చేరుకున్న మృతుల కుటుంబసభ్యుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. మండలంలోని చుట్టుప్రక్కల గ్రామాల నుంచి వేలాదిమంది ప్రజలు తరలివచ్చి మృతిచెందిన యువకుల మృతదేహాలను చూసి చలించిపోయారు.

## ఏ.డి, ఏఇలపై ఆగ్రహం

విద్యుధ్ఘాతంతో మృతిచెందిన వారి సమీప బంధువులు ఉదయగిరి డిస్కం ఏ.డి శ్రీనివాస్, మర్రిపాడు ఇన్‌ఛార్జి ఏఇ ఆనందరావులపై దాడికి దిగారు. వారి నిర్లక్ష్యం వల్లే తమ బిడ్డల ప్రాణాలు పోయాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

---




## కాకాణికి సహకరించాలి

వైకాపా జిల్లా అధ్యక్షుడుగా నియమితులైన సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డికి జిల్లాలోని అందరు ఎంపీలు, ఎమ్మెల్యేలు సహకరించాలి. జిల్లాలో పార్టీ బలంగా వుంది. నాయకులంతా సమన్వయంతో పనిచేస్తే మరింత బలపడగలదు. గోవర్ధన్‌రెడ్డి వివాదరహితుడు. అందరినీ కలుపుకుపోగలడు. కాకాణికి అభినందనలు.

*బి.ఆర్.శాలి, కావలి.*

## బాధాకరం

ఆవు ఎవరికీ మాత కాదని జెస్టిస్ మార్కండేయ కట్జూ లాంటి వ్యక్తులు వ్యాఖ్యానించడం బాధాకరం. దేశంలో వున్న 70శాతం మంది హిందువులు గోవును తల్లిగా, దేవతగా పూజిస్తారు. న్యాయశాస్త్రాలను చదివిన మేధావి ఆయన. ఇలాంటి మేధావులు పశు సంపదను కాపాడడానికి, ఆ మూగజీవాలను రక్షించడానికి కృషి చేస్తారని ఆశిద్దాం.

*– రావి ప్రసాద్, సూళ్లూరుపేట.*

## రాజధాని భ్రమ

ఒక వింత ప్రపంచాన్ని సృష్టించడంలో ఎవరైనా చంద్రబాబుకు క్రిందే! రాష్ట్రంలో ఆయన వింత లోకాలను సృష్టిస్తున్నాడు. అమరావతి రాజధాని ఇలాంటిదే! ఆచరణ సాధ్యం కాని ఊహా ప్రపంచమది. రైతులను నాశనం చేసి వారి సమాధులను పునాదులుగా మార్చి కట్టాలనుకుంటున్న రాజధాని ఇది. ఇలాంటి రాజధానిలో వుండేవాళ్లు సుఖసంతోషాలతో ఉండగలరా? నిత్యం ఆత్మఘోష వినిపించదా?

*జి.వాసు, గూడూరు.*

## పందులను పట్టండి

నెల్లూరు నగరంలో పందులు ఎక్కువగా వుంటున్నాయి. ఇళ్ల ముందు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. వీధుల్లోనే జనం చెత్తా చెదారం, మిగిలిపోయిన ఆహారపదార్థాలు వేస్తుండడంతో పందులు అక్కడకు చేరుతున్నాయి. మాగుంట లేఅవుట్, హరనాథపురం, సంతపేటలలో పందులు ఎక్కువగా వున్నాయి. పందులను తరలించడంపై కార్పొరేషన్ అధికారులు దృష్టిపెట్టాలి.

*– వాసిలి రాజేశ్వరి, నెల్లూరు.*

# చేనేత వస్త్రాలను ఆదరించాలి



భారతదేశ సాంప్రదాయానికి ప్రతీకలు హస్త కళలని, నేటి పరిస్థితుల్లో రెడీమేడ్ వస్త్రాలు ప్రస్తుతం ముంచెత్తుతున్నాయని, ఇటువంటి పరిస్థితుల్లో చేనేత వస్త్రాలను ఆదరించాల్సిన అవసరం వుందని నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అన్నారు. నెల్లూరు దర్గామిట్ట టిటిడి కళ్యాణ మండపంలో సోమవారం విజయవాడకు చెందిన లేపాక్షి హస్తకళల ప్రదర్శన, అమ్మకాలను జేసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో ఉంచిన పలురకాల హస్తకళ వస్తువులను, వస్త్రాలను ఆయన తిలకించారు. నిర్వాహకులు టి.వెంకటరమణప్ప మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. కలంకారి డ్రెస్‌మెటీరియల్స్ బెడ్‌షీట్లు, నైటీలు, నైట్ డ్రస్సులు, లుంగీలు, పోచంపల్లి దుప్పట్లు, చీరలు, మంగళగిరి చీరలు, బెంగుళూరు సిల్క్ చీరలు, కంచి కాటన్ చీరలు, చీరాల చీరలు, నర్సాపురం లేస్‌లు, పుత్తూరు టవల్స్, ఖాదీ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, నిర్మల్ పెయింటింగ్‌లు, బ్లాక్‌మెటల్, మధ్యప్రదేశ్ చీరలు, జైపూర్ కుర్తాలు, చిన్నపిల్లల డ్రస్సులు, బ్యాంగిల్స్, జూట్‌బ్యాగులు ఉన్నాయన్నారు.

## పూజల ధరలు తగ్గించాలి



నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వివిధ పూజల టిక్కెట్ల రేట్లను, పూజా సామాగ్రి రేట్లను పెంచడాన్ని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి ఒక ప్రకటనలో ఖండించారు. ఎంతోమంది దాతలు ముందుకొచ్చి ఈ దేవస్థానం అభివృద్ధికి పాటు పడ్డారు. లక్షలాది మంది భక్తులు అమ్మవారి దర్శనంతో తరిస్తున్నారు. ఇలాంటి పవిత్ర ఆలయాన్ని కమీషన్ల కోసం కక్కుర్తి పడి వ్యాపార కేంద్రంగా మార్చొద్దంటూ ఆయన దేవాదాయశాఖ సహాయ కమిషనర్‌కు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రికి, దేవాదాయ శాఖ కమిషనర్‌కు లేఖలు వ్రాసారు.

## ఆర్టీఓ ఆఫీసులోనే ఎఫ్‌సి

నెల్లూరు, భక్తవత్సలనగర్‌లోని రవాణాశాఖ కార్యాలయం ప్రాంగణంలోనే వాహనాల ఫిట్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. బస్సులు, లారీలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు ఇటీవల నెల్లూరురూరల్ ఆమంచర్ల వద్ద రవాణాశాఖకు కొంత స్థలం కేటాయించడం జరిగింది. అయితే ఆ స్థలం మాదంటూ కొందరు స్థానికులు ఆందోళనకు దిగడంతో ఇది వివాదంలో పడింది. ఆమంచర్ల దాకా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లకు పోవడానికి వాహన దారులు ఇబ్బందిపడసాగారు. ఆమంచర్ల స్థలం కేసు కోర్టులో పడడంతో రవాణాశాఖ వాళ్ళు ఇక చేసేది లేక తమ కార్యాలయం పక్కనే వున్న ఖాళీ స్థలంలో ఫిట్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

## నెల్లూరు జేసీస్‌కు అవార్డుల వరద



ఈనెల 5వతేదీన తిరుపతిలోని పిఎల్ఆర్ గ్రాండ్ హోటల్ నందు జరిగిన జెసిఐ జోన్ కాన్ఫరెన్స్‌లో జెసిఐ నెల్లూరుటౌన్‌కు అవార్డులు వెల్లువెత్తాయి. అవుట్ స్టాండింగ్ లోకల్ ఆర్గనైజేషన్ ఆఫీసర్ అవార్డ్, అవుట్ స్టాండింగ్ జూనియర్ జేసీ అవార్డ్, అవుట్ స్టాండింగ్ జూనియర్ జెసి యాక్టివిటీస్ అవార్డు, అవుట్ స్టాండింగ్ పబ్లిక్ రిలేషన్ ప్రోగ్రామ్స్ అవార్డ్, అవుట్ స్టాండింగ్ యుఎన్ఎండిజి అవార్డు, అవుట్ స్టాండింగ్ జేసీరేట్ అవార్డు వంటి మరికొన్ని అవార్డులు కూడా లభించాయి. జేసిఐ జోన్ ప్రెసిడెంట్ వి.పవన్‌కుమార్ ఈ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఎం.సతీష్‌కుమార్, తవ్వా శ్రీనివాసులు, సురేష్, మధుసూధన్, పి.జనార్ధన్, చింతాల మధు, సి.వి. శరత్‌కుమార్, ఎం.రామకృష్ణ, ఓబులేశ్వరరావు, మస్తాన్‌రావు, సుభాషిణి, నితీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# చీపురు పట్టిన కలెక్టర్



స్వచ్ఛభారత్-స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా 3వ తేదీ నెల్లూరు కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలోని పరిసరాలను శుభ్రం చేశారు. జిల్లా కలెక్టర్ యం.జానకి, జేసీ ఇంతియాజ్, డిఆర్వో ఎం.సుదర్శన్‌రెడ్డి, ఏవో రామకృష్ణ తదితరులు పరిసరాలను శుభ్రం చేసి, గడ్డిమొక్కలను తీసివేసి చెత్త బండిలో వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, అవసరమైన ప్రదేశాల్లో చెత్త కుండీలను ఏర్పాటు చేయాలన్నారు. మొక్కలు నాటడానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని, గోల్డెన్‌జూబ్లీ హాలు వెనుకవైపున పడిపోయిన ప్రహరీగోడను పునర్నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరి అధికారి రుద్రప్రతాప్, పౌరసరఫరాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ లాల్‌జాన్ అస్మింగ్, డివిఎస్ఓ ధర్మారెడ్డి, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ కొండయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

## యాత్రాజనికి భార్గవి కార్లు



నెల్లూరు దర్గామిట్టలోని కరెంటాఫీసు సెంటర్లో గల భార్గవి ఆటో మొబైల్స్ సంస్థలో 3వ తేదీ యాత్రాజని సంస్థకు 82 స్విఫ్ట్ డిజైర్ కార్లను అందజేశారు. కార్పొరేషన్ బ్యాంకు సహకారంతో ఈ కార్లను యాత్రాజని సంస్థకు అందజేసినట్లు భార్గవి ఆటోమొబైల్స్ ఎం.డి కొండా బలరామిరెడ్డి, సిఇవో కొండా నిరంజన్‌రెడ్డి తెలిపారు. నిరుద్యోగులైన యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా యాత్రాజని సంస్థ అధినేత సత్యనారాయణరెడ్డి తమ వద్ద కార్లను కొనుగోలు చేసినట్లు తెలిపారు. నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో తమ ఆటోమొబైల్స్ ద్వారా కార్లను కొనుగోలు చేసారని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బ్యాంకు జనరల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి, భార్గవి ఆటోమొబైల్ సంస్థ జిఎం రవికుమార్, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సేవాసంఘాల నూతన కార్యవర్గం

నెల్లూరుజిల్లా బ్రాహ్మణ సేవాసంఘాల సమితి ప్రథమ మహాజన సభ ఆదివారం నెల్లూరు ఉస్మాన్‌సాహెబ్ పేటలోని శ్రీ కురువాడ లలితమ్మ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సభలో ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వై.రాంజీ, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ మత్తనపల్లి శివకృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి నాగరాజుగారి వెంకటరాజు, ఉపాధ్యక్షులు స్వయంపాకుల శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యుడు సాగి శ్రీనివాసశాస్త్రి పాల్గొని సంఘ పటిష్టతకు అమూల్య సందేశాలను ఇచ్చారు. అనంతరం నూతన పాలకవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా గుడ్డదొన వాసుదేవరావు, ఉపాధ్యక్షులుగా చక్రాల వెంకటలక్ష్మీనరశింహం, కార్యదర్శిగా ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్, కోశాధికారిగా కొట్రా వెంకటసురేష్‌కుమార్, 17మంది పాలకవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## రాజేశ్వరమ్మ గుడి కమిటీకి కోటంరెడ్డి లేఖ

ఆయుర్వేద వైద్య చికిత్స నిమిత్తం కోయంబత్తూర్‌లో వుంటున్న నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం దసరా ఉత్సవాల సమన్వయ కమిటీసభ్యులకు ఓ లేఖ వ్రాసారు. దసరా ఉత్సవాల సందర్భంగా ప్రచురించే ఆహ్వాన పత్రికలలోగాని, పోస్టర్‌లలోగాని, ఫ్లెక్సీలలో గాని మనుషుల ఫోటోలు పెట్టొద్దని ఆ లేఖలో సూచించారు. శాసనసభ్యుడిగా తన పేరు, ఫోటో కూడా వేయొద్దని పేర్కొన్నారు. అక్కడ ఆధ్యాత్మిక వాతావరణమే కనిపించాలి. విఐపి భక్తుల పేరుతో సామాన్య భక్తులను ఇబ్బంది పెట్టొద్దు. ఉత్సవాల సందర్భంగా మహిళల రక్షణకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయన ఆ లేఖలో కోరారు.

## హింసపురి టైం మారలేదు

దక్షిణ మధ్య రైల్వే శాఖ కొత్త రైల్వే టైంటేబుల్‌ను ఇటీవల ప్రకటించింది. మిగతా ట్రైన్‌ల టైంతో నెల్లూరోళ్ళకు ఇబ్బంది లేదుగాని ఒక్క సింహపురి ఎక్స్‌ప్రెస్ టైమే కరెక్ట్‌గా లేదు. ఇది రాత్రి 10.10గంటలకు గూడూరులో బయలుదేరి 10.40గంటలకు నెల్లూరొచ్చేది. తెల్లారి ఉదయం 8.45గంటలకు హైదరాబాద్ చేరుకునేది. దాదాపు ప్రతిరోజూ గంటన్నా ఆలస్యంగా ఈ ట్రైన్ హైదరాబాద్‌కు పోతుండేది. హైదరాబాద్‌లో ఏదన్నా పని మీద పోయేవాళ్లకు సగం పూట ఈ ట్రైన్‌లోనే అయిపోయేది. ఈ టైం చాలా ఇబ్బందిగా వుందని, ఇంకా ముందుకు జరపాలని నెల్లూరు రైల్వే ప్రయాణీకులు ఎప్పటినుండో కోరుతున్నారు. ఈమధ్య నెల్లూరొచ్చిన డిఆర్ఎం కూడా సింహపురి ఎక్స్‌ప్రెస్ వేళలు మారుస్తామని చెప్పారు. కాని ఆచరణలోకి రాలేదు. కొత్త టైంటేబుల్‌లోనూ సింహపురికి పాతటైమే ఇచ్చారు. సింహపురి ఎక్స్‌ప్రెస్‌కి వున్న హింసపురి పేరుకు సార్ధకత చేకూర్చారు.

## డిఎస్పీల బదిలీ


నెల్లూరుజిల్లాలోని ఇద్దరు డిఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డిజిపి కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు జారీ అయినట్లు సమాచారం. నెల్లూరు స్పెషల్ బ్రాంచి డిఎస్పీగా పనిచేస్తున్న జయరామసుబ్బారెడ్డిని డిసిఆర్బికి బదిలీ చేసారు. అక్కడ పని చేస్తున్న కోటారెడ్డిని స్పెషల్‌బ్రాంచ్ డిఎస్పీగా బదిలీ చేశారు.

## రాజేశ్వరమ్మ రాబడి

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం హుండీని 5వ తేదీ లెక్కేసారు. జూలై 2 నుండి అక్టోబర్ 5వ తేదీ వరకు హుండీల ద్వారా 17.05లక్షల రూపాయలు వచ్చింది. ఆలయ ఇఓ పి.కోదండరామిరెడ్డి పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు





# వేడుకగా 'స్వచ్ఛ' సాంబమూర్తి 'సంగీత' పండుగ

**ఒకే రోజు మూడు పండుగలు వస్తే ఎంత సందడి వుంటుందో, ఈ నెల 3వ తేదీన నెల్లూరులో కూడా మూడు వేడుకల సందడి నెలకొంది. నగరంలో ఆరోజు ఎటు చూసినా పండుగ వాతావరణమే కనిపించింది. త్రివేణి సంగమంలా 'స్వచ్ఛభారత్ ర్యాలీ', 'సాంబమూర్తి విగ్రహావిష్కరణ', 'స్వచ్ఛ సంగీతం' కార్యక్రమాలతో నెల్లూరు పులకించగా, పురప్రజలు పరవశించిపోయారు. పద్మభూషణ్ బిరుదాంకితులు యస్.పి.బాలసుబ్రహ్మణ్యంతో పాటు కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు, దక్షిణాది సూపర్‌స్టార్ కమల్‌హాసన్, తెలుగు చలన చిత్ర పరిశ్రమ గర్వించదగ్గ దర్శకుడు 'కళాతపస్వి' కె.విశ్వనాథ్‌లు ఈ వేడుకలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.**

## జోరుగా స్వచ్ఛ భారత్ ర్యాలీ

ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్వచ్ఛభారత్‌ను ప్రారంభించి ఏడాదైన సందర్భంగా ఈ నెల 3వ తేదీన నెల్లూరులో స్వచ్ఛభారత్ ర్యాలీకి శ్రీకారం చుట్టారు. కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు, స్వచ్ఛభారత్ అంబాసిడర్ బాలసుబ్రహ్మణ్యంల సారథ్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు వి.ఆర్ హైస్కూల్ మైదానం వద్ద వెంకయ్య, బాలూలు జెండా వూపి ర్యాలీని ప్రారంభించారు. నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన వేలాదిమంది విద్యార్థినీ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ ర్యాలీలో పాల్గొని పోలీసు మైదానం వరకు నడిచారు. స్వచ్ఛభారత్ ర్యాలీని జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి పర్యవేక్షించగా, ఎంపీ మేకపాటి రాజ మోహన్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, మేయర్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పి.అనిల్‌కుమార్‌యాదవ్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, జిల్లా ఎస్పీ గజరావ్ భూపాల్ తదితరులు పాల్గొని నడిచారు. మైథిలి స్కూల్ అధినేత బి.మనోహర్‌రెడ్డి, మాడరన్ స్కూల్ అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డిలు ఎంతో కృషి చేసి ఈ ర్యాలీకి వేల సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చేలా చేసారు.




## నెల్లూరు పండుగగా సాంబమూర్తి విగ్రహావిష్కరణ

నెల్లూరులో ఎన్నో విగ్రహాలున్నాయి. అందులో జాతీ యోద్యమ నాయకులున్నారు, ప్రజా నాయకులు, రాజకీయ నాయకులు, ఆధ్యాత్మిక, సాహిత్య రంగాలకు చెందిన వాళ్ల విగ్రహాలున్నాయి. కాని నెల్లూరుకు చెందిన ఒకే ఒక సాహిత్య సంగీతమూర్తి విగ్రహం సాంబమూర్తి గారిదే! సాంబమూర్తి సతీమణి, ఎస్పీ బాలు తల్లిగారైన శ్రీమతి శకుంతలమ్మ చేతుల మీదుగా సాంబమూర్తి విగ్రహావిష్కరణ జరిగింది. సాంబమూర్తి విగ్రహావిష్కరణలో కేంద్రమంత్రి వెంకయ్య, కమల్‌హాసన్, కె.విశ్వనాథ్‌లతో పాటు బాలూ కుటుంబసభ్యులంతా పాల్గొని ఆ మహనీయునికి నివాళులర్పించారు.

## చెరగని కీర్తి... భావితరాలకు స్ఫూర్తి... మన సాంబమూర్తి

అక్టోబర్ 2వ తేదీ... అహింసా వజ్రా యుధంతో తెల్లదొరలను తరిమికొట్టి దేశానికి స్వరాజ్యం తెచ్చిన మహాత్ముడి జయంతి. దేశమంతా గుర్తు పెట్టుకునే రోజు. అక్టోబర్ 3వ తేదీ... నెల్లూరీయులు గుర్తుంచుకునే చిరస్మరణీయ దినం. త్యాగరాజ కీర్తనలను దక్షిణ భారతానికి పరిచయం చేసి, తన హరికథా గానంతో లక్షలాది మంది సంగీతప్రియులను అలరించి, తెలుగు, తమిళ, మళయాల, కన్నడ చిత్ర పరిశ్రమలకు ఆణిముత్యం లాంటి గానగంధర్వుడు యస్.పి.బాలసుబ్రహ్మణ్యం వంటి ప్రపంచ ప్రసిద్ధ గాయకుడికి జన్మనిచ్చిన శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి విగ్రహాన్ని ఆవిష్కరించిన రోజు.



## ఉర్రూతలూగించిన స్వచ్ఛ సంగీతం

పోలీస్‌గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన స్వచ్ఛ సంగీత కార్యక్రమం ప్రేక్షకులను మైమరపించింది. సంగీత సంరంభానికి ముందు 'లాయర్' వారపత్రిక ఆధ్వర్యంలో రూపొందించిన 'ఇదీ సాంబమూర్తి గారి కథ' ప్రత్యేక అనుబంధాన్ని అతిథులు ఆవిష్కరించారు. అనంతరం వారి ప్రసంగాలు సాగాయి. 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' గీతంలో మొదలైన సంగీత కార్యక్రమం చివరిలో బాలు పాడిన 'పుణ్యభూమి నా దేశం నమో నమామి' పాటతో ముగిసింది. 'పాడుతా తీయగా' చిన్నారులు ఆలపించిన ప్రతి పాట కూడా ప్రేక్షకుల హర్షధ్వానా లందుకుంది. ఎందుకంటే ఈ కార్యక్రమంలో ఎక్కడా చెత్తపాటలు పాడలేదు. 'స్వచ్ఛ సంగీతం' అన్న పేరుకు తగ్గట్లే స్వచ్ఛమైన సాహిత్యం, స్వచ్ఛమైన అర్థాలు, స్వచ్ఛమైన సందేశాలు, స్వచ్ఛమైన సంగీతం వున్న పాటలనే పాడి ప్రేక్షకులను అలరించారు. ఎస్పీ బాలూ బృందం చివరి పాట పాడి సభకు సెలవు చెప్పేవరకు ప్రేక్షకులు తమ సీట్ల నుండి లేవలేదంటే ఈ సంగీత కార్యక్రమం ఎంత స్వచ్ఛంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. చివరగా శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ వ్యవస్థాపకులు శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి విగ్రహావిష్కరణ కమిటీ ముఖ్య సమన్వయకర్త తుంగా శివప్రభాత్‌రెడ్డి వందన సమర్పణతో ఆరోజు పండుగ ముగిసింది.

## కష్టమంతా కమిటి సభ్యులదే...


ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి గారి విగ్రహప్రతిష్ఠాపన కమిటి సభ్యుల కష్టం వెలకట్టలేనిది. ఈ కమిటి సభ్యులంతా కూడా బాలూ మీదున్న అభిమానంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అహర్నిశలు శ్రమించారు. ఈ కార్యక్రమాన్ని తమ ఇంట జరిగే శుభ వేడుకకంటే గొప్పగా భావించారు. యస్.పి.బాలసుబ్రహ్మణ్యం గౌరవాధ్యక్షులుగా, మురళీకృష్ణ సంస్థల వ్యవస్థాపకులు గ్రోసు గోపాలయ్య అధ్యక్షులుగా వున్న ఈ కమిటీలో ముఖ్యసమన్వయకర్త తుంగా శివప్రభాత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వీరిశెట్టి హజరత్‌బాబుల ఆధ్వర్యంలో సభ్యులుగావున్న టివియస్ చలపతిరావు, యనమండ్ర నాగదేవీప్రసాద్, బెజవాడ నరేష్‌చంద్రారెడ్డి, బి.మనోహర్ రెడ్డి, వాకాటి విజయకుమార్‌రెడ్డి, కనుమూరు శ్రీనివాసులురెడ్డి, డి. హేమంత్‌కుమార్, వీరిశెట్టి శ్రీనివాసరావు, ఎన్.బల రామయ్యనాయుడు, వీరిశెట్టి చంద్రశేఖర్‌రావు, కళాంజలి అనంత్, పోలంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, వరిగొండ సురేష్‌బాబు, వీరిశెట్టి సుధాకర్‌లు తమ బాధ్యతలను చక్కగా నిర్వర్తించి ఈ కార్యక్రమాలను నిర్విఘ్నంగా జరిపించడంలో సహకరించారు.

## ఎవరెవరు ఏమన్నారు..?

ఇక స్వచ్ఛసంగీతం కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు సాంబమూర్తి ఔన్నత్యాన్ని, బాలుతో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం తమ అదృష్టంగా చెప్పుకొచ్చారు.

మిగతా 11వ పేజీలో...








# గూడూరు డివిజన్ వార్తలు



## అందరి సహకారంతోనే స్వచ్ఛ గూడూరు

**- ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన**

అధికారులు, కౌన్సిలర్లు, ప్రజల సహకారంతోనే స్వచ్ఛగూడూరును సాధిస్తామని పురపాలక ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. గూడూరు పట్టణంలోని రైల్వేస్టేషన్ నుంచి సంగం థియేటర్ ప్రాంతం వరకు ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా కమిషనర్ మోదకొండతో కలసి రోడ్లను శుభ్రపరిచారు. కౌన్సిలర్ శ్రీదేవి, పుర సిబ్బంది రోడ్లను ఊడ్చి చెత్తను తొలగించారు. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు విక్రయించడాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దుకాణాల ముందు చెత్తాచెదారాలు వేయకుండా కుండీలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా రెండో పట్టణంలోని మాలవ్యానగర్ ప్రాంతంలోని ప్రధానరోడ్లను స్థానిక కౌన్సిలర్ రమేష్, సిబ్బందితో కలసి చీపుర్లను పట్టి శుభ్రం చేశారు. మాజీకౌన్సిలర్ రత్నం పాల్గొన్నారు. కాగా, గూడూరు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వెంకట నారాయణమ్మ ఆధ్వర్యాన స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యాలయ గదులను శుభ్రం చేశారు.

## రోటరీ క్లబ్ వరల్డ్ టీచర్స్ డే

ప్రతి సంవత్సరం అక్టోబర్ 5న జరిగే వరల్డ్ టీచర్స్‌డేను గూడూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నాడు ముగ్గురు రిటైర్డ్ టీచర్స్ అయిన ఎ.రాధాకృష్ణయ్య, సి.హెచ్.చినరామయ్య, పచ్చా ప్రేమ నందంలను ఘనంగా సన్మానించారు. రొటేరియన్లు డి.దశరథరామిరెడ్డి, యల్.వి.రమణబాబు, యస్.వి.నాగేంద్రప్రసాద్‌లు స్పాన్సర్లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షుడు యస్.వి.అశోక్ చక్రవర్తి మాట్లాడుతూ 1994 సం॥ నుండి ప్రతి సంవత్సరం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్యదర్శి పి.మునిరాజా, రొటేరియన్లు డాక్టర్ సిఆర్ రెడ్డి, జిడిరెడ్డి, కెయస్‌రెడ్డి, కె.సుందరరామిరెడ్డి, బి.జానకిరామిరెడ్డి, కె.మునిగిరీష్, ఎ.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సొల్లేటి



గూడూరు డివిజన్ ఆర్య వైశ్య సంఘ అధ్యక్షుడిగా సొల్లేటి వెంకట గురుప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీనికి సహకరించిన రాష్ట్ర ఈసీ మెంబర్ సోమిశెట్టి చెంచురామయ్యకు, జిల్లా రూరల్ అధ్యక్షుడు కొండా లక్ష్మీనారాయణ(కాశి)కి, ఎన్నుకొన్న మిగతా సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతూ ఆర్యవైశ్యుల్లో వెనుకబడిన వారి అభ్యున్నతికి కృషి చేస్తానని గురుప్రసాద్ 'లాయర్'కు తెలిపారు.

## స్వచ్ఛ రైల్వేస్టేషన్‌కు సహకరించండి



గూడూరు రైల్వే జంక్షన్లో 3వ తేదీ స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా రైల్వేస్టేషన్ ఆవరణం, ప్లాట్ ఫారాలపై ర్యాలీ నిర్వహించారు. శుభ్రంగా రైల్వేస్టేషన్ ఉంచుకొనేలా అందరూ కలసి పనిచేయాలని అన్ని వర్గాల వారికి సూచించారు. స్వచ్ఛభారత్ నినాదాలతో ఈ ప్రాంతమంతా మార్మోగింది. ఈ కార్యక్రమంలో గూడూరు రైల్వేస్టేషన్ మేనేజర్ పల్లం వెంకటేశ్వరరావు, విజయవాడ డివిజనల్ ఇంజనీర్ వెంకటరావు, ఆర్పీఎఫ్ ఎస్సై అర్జునరావు, టికెట్ ఇన్స్‌పెక్టర్ బాబురావు, పార్సిల్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఐవోడబ్ల్యు నారాయణరెడ్డి, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## తెదేపాలో శ్రమకు తగిన ఫలితం

**- చేవూరు విజయమోహన్‌రెడ్డి**



తెలుగుదేశం పార్టీలో కష్టపడే కార్యకర్తలకు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు తగిన గుర్తింపు ఇస్తారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి చేవూరు విజయమోహన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర కార్యదర్శిగా తెలుగుదేశంపార్టీలో స్థానం కల్పించడంతో గూడూరు పట్టణంలోని రోడ్లు భవనాల అతిథిగృహంలో ఆయన ఇటీవల విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఆధ్వర్యాన ఇచ్చిన పదవిని సద్వినియోగం చేసుకొని పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. పదవి రావడంపై సీఎం చంద్రబాబునాయుడు, యువనాయకుడు నారా లోకేష్, మంత్రి నారాయణ, ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, గూడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి జ్యోత్స్నలతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం గూడూరు పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కోటంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి గోను శివకుమార్, మాజీకౌన్సిలర్లు ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, ఆదివారం హైదరాబాద్‌లో సిఎం చంద్రబాబు సమక్షంలో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో గూడూరులో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

## పంటకాలువపై మినీబ్రిడ్జి ఏర్పాటు చేయాలి



జ్యోత్స్నలతకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గూడూరులో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులపై రోడ్లు భవనాల శాఖాధికారులతో తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ రాధాజ్యోత్స్నలత చర్చించారు. పట్టణంలోని సంయుక్తనగర్‌లో పంటకాలువపై మినీబ్రిడ్జిని ఏర్పాటు చేయాలని స్థానికుల విన్నపం మేరకు వెంటనే నీరు-చెట్టు కార్యక్రమంలో నిధులు మంజూరు చేసి వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. మండలంలో దీపం పథకం ద్వారా మహిళలకు అందిస్తున్న గ్యాస్ పంపిణీపై నిర్వాహకులతో చర్చించారు. అధిక వసూళ్లకు పాల్పడకుండా దీపం గ్యాస్‌ను అందించాలని సూచించారు. గూడూరు పట్టణంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ పట్టణ, మండల అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, బొల్లినేని కోటేశ్వరరావు, నాయకులు రవీందర్‌రెడ్డి, గోను విక్రమ్, పడిమాల శ్రీహరి, కౌన్సిలర్లు భారతి తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ జయంతి వేడుకలు



పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, ప్రక్కన సబ్‌కలెక్టర్ గిరీషా

గూడూరులోని గాంధీబొమ్మ సెంటర్‌లో వున్న మహాత్మాగాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సబ్‌కలెక్టర్ గిరీషా పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు కొండా కాశీ, సోమిశెట్టి చెంచురామయ్య, ఎస్సై గోపాల్ గాంధీజీకి నివాళులర్పించారు.

అలాగే గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ గిరీషా, మున్సిపల్ ఛైర్మన్ పొనకా దేవసేన గాంధీజీకి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గూడూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి దివాకర్, అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సాయిరాం, పట్టణ సిఐ సుబ్బారావు ఖైదీలనుద్దేశించి ప్రసంగించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ గాంధీజీని స్మరించుకోవాలని, కేవలం శాంతితోనే దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చారని చెప్పారు.

## లయన్స్ ఉచిత వైద్యశిబిరం



లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు ఆధ్వర్యంలో అపోలో హాస్పిటల్స్ నెల్లూరు వారి సారథ్యంలో ఆదివారం నెల్లూరుజిల్లా విడవలూరు మండలం, చంద్రపడియ గ్రామంలో న్యూట్రా స్పెషాలిటీ ప్రైవేట్ లిమిటెడ్‌లో భారీ వైద్య ఉచిత సేవా శిబిరం జరిగింది. ఈ శిబిరంలో నెల్లూరు అపోలో హాస్పిటల్స్‌లోని వివిధ విభాగాలకు చెందిన 9మంది స్పెషలిస్టులు పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇచ్చారు. కంటి వైద్య నిపుణుల పర్యవేక్షణలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరంలో 50యూనిట్లు రక్తం సేకరించి రెడ్‌క్రాస్ వారికి అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ డా॥ గజరావు భూపాల్, చెన్నై షాసున్ ఫార్మాసూటికల్స్ లిమిటెడ్ ఎండి ఎస్.అభయ్‌కుమార్, కె.చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు అధ్యక్షులు తోట నాగరాజు, కార్యదర్శి కె.ప్రవీణ్‌శంకర్, కోశాధికారి ఆర్.హజరత్‌బాబు, సభ్యులు పాల్గొన్నారు. ఇంటర్నేషనల్ ఐసైట్ వీక్ సందర్భంగా నెల్లూరు ఏసినగర్ యల్లమందయ్య స్కూల్‌లోని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 14వ డివిజన్ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. 3వ తేదీ లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు ఆధ్వర్యంలో నెల్లూరు బివి నగర్‌లోని కెవిఆర్ మునిసిపల్ హైస్కూల్ విద్యార్థులకు పర్సనల్ డెవలప్‌మెంట్ సబ్జెక్టు మీద అవగాహన సదస్సును నిర్వహించారు.

## మేషం



అశ్విని, భరణి, కృతిక 1 పాదము

దేశ విదేశ ప్రయాణాలు నిర్ణయం కావడం, స్థిరాస్తుల నుండి స్టాక్ మార్కెట్ల వల్ల లాభాలు పొందడం జరుగుతుంది. మంచి పెట్టుబడి వ్యాపార అవకాశాలు దొరకవచ్చును. ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులు స్వల్ప ఇబ్బందులు ఏర్పడి మరలా విజయ వంతంగా నెరవేరగలవు. మీ సూచనలు, నిర్దేశాలకు గుర్తింపు, అభినందనలుంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వ్యాపారులకు మంచి ఆర్థికావకాశాలు లభిస్తాయి. ఆదాయము స్వల్పంగా పెరుగుతుంది. వృత్తి పరంగా పలువురిలో పలుకుబడి పరిచయాలుంటాయి. సంపాదనకు తగ్గట్లు ఖర్చులు పెరుగుతాయి. కుటుంబంలో విభేదాలు వచ్చే అవకాశం ఉన్నది. కొన్ని పనులు అయిష్టంగానే చేయవలసి వస్తుంది. రావలసిన బాకీలు వాయిదా పడతాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఉద్యోగార్థులకు అవకాశాలు లభించగలవు. విరాళాలు చందాల రూపంలో సంస్థలకు సహాయమందిస్తారు. క్రీడా కళా రంగాల వారు మంచి గుర్తింపు పొందుతారు. అనుకున్న పనులకు ఆటంకాలు రావడం, సరిగా జరగక పోవడం వల్ల చికాకు, టెన్షన్ ఉంటుంది. ఏదో ఒక రూపంలో ఖర్చులు ఎక్కువ కాగలవు. ఈ రాశి వారికి ఆదాయం సామాన్యము.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

కళా క్రీడా శాస్త్ర సాంకేతిక రంగాలలో అవకాశాలు ఉద్యోగాలు దొరకగలవు. ఇంటర్వ్యూ అవకాశాలు ఉంటాయి. అనవసర విషయాలలో తల దూర్చకండి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడవచ్చును. వృత్తి వ్యాపారాలలో ఆదాయం, ఆర్థికావకాశాలు తగ్గుతాయి. పలు కారణాల రూపంలో ఖర్చులు పెరుగుతాయి. అనుకున్న పనులు ఆటంకాలతో నిదానంగా జరుగుతాయి.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 09.10.2015 నుండి
తేది. 15.10.2015 వరకు

ఈ వారం మీనంలో కేతువు, సింహ కన్య తులలో చంద్రుడు, సింహంలో గురు శుక్రులు, కన్యలో రవి బుధ కుజ రాహువులు, వృశ్చికంలో శని సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 12 సోమవారము మహాలయ అమావాస్య
తేది 13 మంగళవారము శరన్నవరాత్రి ఉత్సవములు ప్రారంభము.

### భాద్రపద మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 9 | శుక్ర | ద్వాదశి | రా॥ గం.10.03ని॥ |
| తేది. 10 | శని | త్రయోదశి | రా॥ గం.11.22ని॥ |
| తేది. 11 | ఆది | చతుర్దశి | రా॥ గం.1.52ని॥ |
| తేది. 12 | సోమ | అమావాస్య | రా॥ గం.4.00ని॥ |

### ఆశ్వయుజ మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 13 | మంగళ | పాడ్యమి | రా॥ గం.5.58ని॥ |
| తేది. 14 | బుధ | విదియ | పూర్తిగ |
| తేది. 15 | గురు | విదియ | ఉ॥ గం.7.43ని॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

చేపట్టిన పనులు సానుకూలం కాగలవు. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత బాగుంటుంది. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగులకు అధికారులతో సాన్నిహిత్యము పెరుగుతుంది. మంచి వ్యాపార అవకాశాలు, పెట్టుబడి అవకాశాలు దొరుకుతాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరకగలవు. పోటీ పరీక్షలకు కృషి చేయడం, విద్యార్థులకు మంచి ప్రగతి ఉంటుంది.

## మిథునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ధ, పునర్వసు 1, 2, 3పాదాలు

దైవ సాంస్కృతిక కార్యక్రమాలకు ఆహ్వానాలు అందడం, అనుకోని ప్రయాణాలు జరగడం ఉంటుంది. ఇతరులకు ధన, మాట రూపంలో సహాయం చేస్తారు. కుటుంబ అవసరాలకు, పలుకుబడి కోసం బాగా ఖర్చు పెడతారు. భూముల లావాదేవీ వ్యవహారాలలో జాగ్రత్త అవసరం. పెట్టుబడులు షేర్లు అసంతృప్తి కలిగిస్తాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం బాగానే ఉంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ప్రభుత్వ పరంగా పనులు అనుమతులు ఆలస్యం కావచ్చును. అనుకున్న పనులు జరుపుకొనడానికి చాలా కష్టపడవలసి ఉంటుంది. ఆర్థిక వ్యవహారాలు, లావాదేవీలందు జాగ్రత్తపడండి. వ్యాపార అవకాశాలు తప్పిపోవచ్చును. అనుకున్నంత ఆదాయము రాకపోగా అదనంగా ఖర్చులుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అసంతృప్తి ఉంటుంది. విద్యార్థులకు మంచి ప్రగతి ఉంటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆర్థిక విషయాలలో ఇతర విషయాలలో మీ సూచనలు, వాదనలకు ఆమోదం లభిస్తుంది. వృత్తి వ్యాపారాలలో క్రొత్తదనంతో కొనుగోలుదారులు, ప్రజలను ఆకట్టుకుంటారు. ఆదాయం పెరుగుతుంది. కళా సాంస్కృతిక క్రీడా సాంకేతిక రంగాల వారికి మంచి అవకాశాలు, ప్రోత్సాహం ఉంటుంది. ప్రభుత్వ కార్యాలయాలలో పనుల అనుకూలత, నిరుద్యోగులకు స్వల్ప అవకాశాలుంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

శుభకార్యాలు నిర్ణయం కాక ఆందోళన ఉంటుంది. స్టాక్‌మార్కెట్ అసంతృప్తి కలిగిస్తుంది. తొందరపాటు నిర్ణయాలు చేయడం, బాధపడటం జరుగుతుంది. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేయడం మంచిది. వృత్తి నిర్వహణలో తీరికలేకుండా ఉండటం, వ్యాపార రంగాల వారికి అభివృద్ధి, ఆదాయం పెరగడం జరుగుతుంది. క్రొత్త కాంట్రాక్టులు, క్రొత్త నిర్మాణ పనులు చేపట్టే కృషి ఉంటుంది. ఆరోగ్యం బాగుంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వ్యాపార వర్గాలకు మంచి అవకాశాలు, వ్యాపారవృద్ధి, రాబడి పెరగడం ఉంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. చేపట్టిన పనులు పట్టుదలగా దీక్షతో సాధించుకొంటారు. దైవ క్షేత్ర సందర్శనలు, దూర ప్రయాణాలుంటాయి. అధికారులకు స్థాన చలనము, అదనపు బాధ్యతలుంటాయి. క్రయ విక్రయాలలో జాగ్రత్త అవసరం. ఇతరులకు ధన వస్తు రూపంలో సహకారం అందిస్తారు.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అన్ని రంగాల వారికి తీసుకొనే నిర్ణయాలు సరైన గమ్యాన్ని అందిస్తాయి. కోర్టు కేసులకు అనుకూలత, రావలసిన బాకీలు కొంత వసూలు కాగలవు. వ్యాపార భాగస్వామ్యానికి, స్థిరాస్తుల కొనుగోలుకు అవకాశాలు లభించగలవు. వృత్తి వ్యాపారాలలో పెట్టుబడులు పెడుతారు. ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులు ఏదో ఒక విధంగా అనుకూలంగా నెరవేర్చగలరు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కుటుంబ వృత్తుల సహకారం, సమావేశాలు దైవ కార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. వస్తు వాహన రిపేర్లుంటాయి. ఖర్చులు అదనంగా ఉండినా డబ్బుకు ఇబ్బంది కలుగదు. వ్యాపారాలు బాగుగా కొనసాగి ఆర్థికంగా వృద్ధి చెందుతారు. ఆదాయం బాగుంటుంది. స్టాక్ మార్కెట్ సంతృప్తిగా ఉండదు. క్రొత్త అగ్రిమెంట్, వ్యాపార అవకాశాలు లభించగలవు.

# బాలూను అపార్థం చేసుకున్న కమల్

గల్పిక

అక్టోబర్ 4వ తేదీ... తమిళనాడు రాజధాని చెన్నై నగరమది. సాగరాన్ని చీల్చుకుంటూ ఆకాశానికెగిసిన బంతిలా సూర్యుడు అప్పుడే ఉదయిస్తున్నాడు. సూపర్‌స్టార్ కమల్‌హాసన్ అప్పుడే నిద్రలేచి బెడ్‌రూంలో నుండి హాల్‌లోకి వచ్చాడు. ఆయన ముఖంలో ఏదో బాధ కనిపిస్తుంది. రాత్రంతా ఏదో ఆలోచిస్తూ మనస్తాపం చెందినట్లుగా అని పిస్తోంది. కమల్‌హాసన్ టీవీ ఆన్ చేసి 10+24=240 తెలుగు న్యూస్ ఛానెల్ పెట్టాడు. ఫ్లాష్ న్యూస్‌లో... నెల్లూరులో ప్రబలిన డెంగీ... ముదురుదోమలు కరచి ముప్పైమంది ఆసుపత్రి పాలు... ముగ్గురి పరిస్థితి విషమం... ముదురుదోమలను అరికట్టడానికి కేంద్ర సాయం కోరిన ఏ.పి ముఖ్యమంత్రి చంద్రబాబు అని వస్తున్నాయి. ఈ ఫ్లాష్ న్యూస్‌ను చూడగానే కమల్ ముఖ కవళికలు మారాయి. అయ్యో ఎంత తప్పు చేసాను. ఎంత అపార్థం చేసుకున్నాను... నువ్వు నా మంచి కోరితే, నేను నీ గురించి తప్పుగా అనుకున్నాను అన్నయ్యా, నన్ను క్షమించు అని ఏడుస్తూ అరవసాగాడు. అతని ఏడుపు విని... ఏమైందొనంటూ ఆదుర్దాగా ఆయన కూతురు శృతిహాసన్ వచ్చింది. ఏడుస్తున్న తండ్రిని పట్టుకుని ఏమైంది డాడ్... ఇంత పొద్దున్నే ఏడుస్తున్నావెందుకు... నువ్వు సినిమాల్లో కూడా ఎప్పుడూ ఇంత సీరియస్‌గా ఏడవ లేదు... ఎందుకేడుస్తున్నావ్, అసలేం జరిగింది. నాకిప్పుడే తెలియాలి అని గట్టిగా అడిగింది. కమల్‌హాసన్ ఏడుపు ఆపి... ఇది చెబితే అర్థమయ్యేది కాదమ్మా, చూడాలి అంటూ... వెళ్లతో శృతిహాసన్ ముందు చతురస్రాకారం స్క్రీన్ గీసి ఫ్లాష్ బ్యాక్ లోకి తీసుకెళ్లాడు.

★★★★★

అక్టోబర్ 3వ తేదీ... తనకు దేవుడిచ్చిన అన్నయ్య ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం ఆహ్వానం మేరకు ఆయన తండ్రి శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు చెన్నై నుండి కమల్‌హాసన్ బయల్దేరాడు. వెంకటాచలం వద్ద కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు ఆయనకు స్వాగతం పలికి స్వర్ణభారత్ ట్రస్ట్‌లోకి తీసుకెళ్లాడు. బ్యాటరీ కారులో ఎక్కించి ట్రస్ట్ ప్రాంగణమంతా తిప్పి చూపించాడు. తర్వాత డైనింగ్ హాల్‌లోకి తీసుకెళ్లాడు. కమల్‌కు వెంకయ్య స్వయంగా అరిశెలు, అన్నం, సాంబార్, పప్పు, రసం, పెరుగు వడ్డించాడు. కమల్ అరిశె తిని... ఇది చాలా రుచిగా వుంది... దీనిలో ఏం కలిపారు సార్... అని అడిగాడు. వెంకయ్య వుండి... బియ్యం, బెల్లం, నువ్వులు కలిపారని చెబుతుండగా మధ్యలో ఓఎస్‌డి సత్య జోక్యం చేసుకుని... వాటితో పాటు మా సారు ప్రేమ, అభిమానం మిక్స్ చేసారని, కాబట్టే అది అంత టేస్ట్‌గా వుందని చెప్పాడు. సత్య సెంటిమెంట్ మాటలకు వెంకయ్య కళ్లు చెమ్మగిల్లాయి. కమల్‌హాసన్ అక్కడ భోజనం ముగించుకుని నెల్లూరుకు బయల్దేరాడు. కమల్ కారులో జాతీయ రహదారి మీద నుండి 120కిలోమీటర్ల వేగంతో నెల్లూరు జివిఎన్‌టి రోడ్డులోకి ప్రవేశించి అయ్యప్పగుడి మీదుగా పోతున్నాడు. అయితే కమల్‌కు షాక్ ఇచ్చే సంఘటన అప్పుడే చోటు చేసుకుంది. కమల్ కారును నాలుగు ఆటోలు ఓవర్‌టేక్ చేసి ముందుకు విమానాల్లాగా దూసుకుపోయాయి. కమల్ బిత్తరపోయి అవి ఆటోలా.. లేక రోడ్డ మీద తిరిగే విమానాలా అని పక్కన కూర్చున్న వెంకయ్యని అడిగాడు. దానికి వెంకయ్య... అవి ఆటోలే.. కాకపోతే నెల్లూరు ఆటోలకు శ్రీహరికోటలోని షార్‌లో తయారయ్యే రాకెట్ ఇంజన్‌లను అమర్చుతుంటారు. కాబట్టే అవి రాకెట్ల మాదిరిగా దూసుకుపోతుంటాయని చెప్పాడు. నెల్లూరు టౌన్‌ను చూడాలని అడిగేసరికి కమల్‌ను వెంకయ్య ట్రంకురోడ్డు మీదుగా తీసుకుపోతున్నాడు. కరెక్ట్‌గా జిల్లా కోర్టు ప్రాంగణం దాటాక కారు ఊయల మాదిరిగా ఊగసాగింది. కమల్ ఆ వూగడాన్ని ఎంజాయ్ చేస్తూ... ఇక్కడ రోడ్లు చాలా బాగున్నాయి సార్, ఇలా వాహనాలలో పోతుంటే వూగే విధంగా మా చెన్నైలో రోడ్లు లేవు... ఇంకా మేం వెనుకబడి వున్నామన్నాడు. అది విని వెంకయ్య మనసులో... మా నెల్లూరు గతుకులరోడ్లు ఈ విధంగా కూడా ఉపయోగపడుతున్నాయన్న మాట అని అనుకున్నాడు. కారులో అన్ని సెంటర్లను వెంకయ్య, కమల్‌కు చూపిస్తూ... వాటి గురించి చెబుతున్నాడు. దారిలో విఆర్ కాలేజీని చూపించి... తాను చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నాడు. తర్వాత సీమా సెంటర్‌కు తీసుకెళ్లి... గతంలో తాము చేసిన ఘనకార్యాలను చెప్పాడు. సీమా సెంటర్ వద్ద కారు ఆపి టీ తాగించాడు. అక్కడ నుండి ఆత్మకూరు బస్టాండ్ వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ రెండు కిలోమీటర్ల పొడవున ట్రాఫిక్‌జాం అయ్యింది. కమల్‌హాసన్ కారు కూడా ట్రాఫిక్‌లో ఇరుక్కుంది. వెంటనే కొందరు హాకర్స్ వీరి కారును చుట్టుముట్టి... బిర్యానీ, పులిహోర, పొంగల్, ఇడ్లీ, మజ్జిగ... అంటూ అరవసాగారు. కమల్ ఆశ్చర్యంగా... టౌన్‌లో కూడా ఈ ఫుడ్ ప్యాకెట్లు అమ్ముడమేంటని అడిగాడు. వెంకయ్య నవ్వి... ఒక్కోసారి నెల్లూరు రోడ్ల మీద నాలుగైదు గంటలు ట్రాఫిక్ ఆగిపోతుంది... వాహనాలలో ఉన్నోళ్లు ఆకలితో బాధ పడకుండా ఉండడానికి ఈ ఏర్పాట్లు... అని చెప్పాడు. ఓ గంట తర్వాత ట్రాఫిక్ ముందుకు కదిలింది. వెంకయ్య వుండి... కమల్ ఇక తిరిగింది చాలు... ప్రోగ్రామ్ టైం అవుతుంది, నాకు టైం పంక్చువాలిటీ చాలా ముఖ్యం అని చెప్పాడు. దాంతో ఇద్దరూ నేరుగా కస్తూర్బా కళాక్షేత్రం వద్దకు వచ్చారు. అక్కడ అప్పటికే ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, కె.విశ్వనాథ్‌లతో పాటు జిల్లా ప్రజాప్రతినిధులంతా వీరి కోసం వేచి చూస్తున్నారు. కమల్, వెంకయ్యలు వచ్చాక శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి విగ్రహాన్ని ఎస్పీ బాలు తల్లి శ్రీమతి శకుంతలమ్మ ఆవిష్కరించారు. అందరూ సాంబమూర్తి విగ్రహానికి పూలు చల్లి నివాళులర్పించారు. తర్వాత అక్కడ నుండి పోలీస్‌గ్రౌండ్‌కు చేరుకున్నారు. 'స్వచ్ఛ సంగీతం' కార్యక్రమం మొదలైంది. అతిథులంతా ఉపన్యాసాలు చేసారు. తర్వాత 'పాడుతాతీయగా' చిన్నారులు పాటలు పాడడం మొదలుపెట్టారు. అప్పుడు రాత్రి 7గంటలయ్యింది. వెంకయ్య అదరాబదరా వేదిక దిగి... ఇక ఢిల్లీకిపోవాలి, నేనొస్తానంటూ లేచాడు. కమల్ మాత్రం అక్కడే కుర్చీలో కూర్చుని వున్నాడు. కమల్‌తో వెంకయ్య, నేను చెన్నైకే వెళుతున్నాను, వస్తారా అని అడిగాడు. కమల్ వుండి... కాదు, నేను రాత్రికి ఇక్కడే వుండి, ఈ నెల్లూరు గాలిని పీల్చుకుని, మురళీకృష్ణ భోజనాన్ని తిని రేపొద్దున వెళ్తానన్నాడు. ఆ మాటకు వెంకయ్య బిత్తర పోయి... ఏంటి... ఈ రాత్రికి ఇక్కడే ఉంటావా? అని ఆశ్చర్యంగా అడిగాడు. అవును, ఉందామనుకుంటున్నాను, నేను ఒక్క రాత్రి కూడా ఇక్కడ ఉండకపోతే మా బాలు అన్నయ్య ఫీలవుతాడు అని కమల్ చెప్పాడు. నీ ఖర్మ... అన్నట్లు వెంకయ్య జాలిగా ముఖం పెట్టి తన కారు వైపుకు బయల్దేరాడు.

స్టేజీ మీద బాలు పిల్లల చేత పాటలు పాడిస్తుండగా, స్టేజీ ముందు కమల్‌హాసన్ కూర్చుని పాటలు వింటున్నాడు. కొద్దిసేపటికి స్టేజీ మీద నుండి బాలు క్రిందకు చూసాడు. అక్కడ వున్న కమల్‌హాసన్‌ను చూసి ఆందోళనగా కిందకు దిగొచ్చాడు. నేరుగా కమల్ వద్దకు వచ్చి... ఏం కమల్ ఇంకా చెన్నైకు బయలుదేరలేదా? అని మొహమాటం లేకుండా అడిగాడు. ఆ మాటకు కమల్ దిగ్భ్రాంతి చెంది.. ఏంటన్నా ఇది, నేను పోమ్మనాల్సింది పోయి... నేను ఉండాలనుకుంటున్నా పొమ్మంటున్నావే... ఆ వెంకయ్యనాయుడు కూడా నేను రాత్రికి ఇక్కడే వుంటానంటే నా వైపు జాలిగా చూసాడు... మీ నెల్లూరోళ్లంతా ఇంతేనా అని ఆవేశంగా అడిగాడు. దానికి బాలు... మా నెల్లూరోళ్లు ఎలాంటి వాళ్లో నీకు తర్వాత తెలుస్తుంది, ఇంకో క్షణం కూడా నువ్వు ఇక్కడ వుండడానికి వీల్లేదు, వెంటనే బయల్దేరు అంటూ దగ్గరుండి కారెక్కించాడు. కమల్ మనసులో బాధపడుతూ, పిలిచి భోజనం పెట్టకుండా పంపిస్తారా అని మనసులో అనుకుంటూ అప్పుడే చెన్నైకు బయలుదేరాడు.

★★★★★

ఇక్కడితో ఫ్లాష్‌బ్యాక్ అయిపోయింది. నేను బాలు అన్నయ్యని అపార్థం చేసుకున్నా నమ్మా... ఆయన నా మంచి కోసమే నిన్న రాత్రి నెల్లూరులో నన్ను ఉండనీయలేదు. రాత్రికి అక్కడే వుంటే నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలు కరిచి ఎక్కడ నాకు డెంగీ జ్వరం వస్తుందోనని ఆయన భయపడ్డాడు. అందుకే నేను ఉంటానన్నా కూడా నన్ను బలవంతంగా చెన్నైకు పంపాడు... నేను ఆయన మంచి మనసును అర్థం చేసుకోకుండా అపార్థం చేసుకున్నాను అని బాధపడసాగాడు. శృతిహాసన్ వుండి... వెంటనే బాలు అంకుల్‌కు ఫోన్ చేయండి డాడీ... వేసి సారీ చెప్పండని అంది. వెంటనే కమల్ సెల్ తీసి బాలుకు ఫోన్ చేసాడు. నెల్లూరులో వున్న బాలు నీరసంగా ఫోన్ ఎత్తాడు. కమల్ వుండి... ఏంటన్నయ్యా, నీరసంగా వున్నారని అడిగాడు. దానికి బాలు... రాత్రి ఇక్కడే వున్నా కదా, రెండు మూడు ముదురుదోమలు కరిచాయి... ఒళ్లంతా ఒకటే నొప్పులు, జ్వరంగా వుందన్నాడు. అప్పుడు కమల్... అయ్యో బాలన్నయ్యా... నా ఆరోగ్యం గురించి మీరు అనారోగ్యానికి గురయ్యారా... మీ మంచి మనసు తెలియక నేను అపార్థం చేసుకున్నా... క్షమించన్నయ్యా అంటూ ఫోన్‌లోనే ఏడుస్తూ అడిగాడు.



# ధరల పాపం మాది కాదు.. ప్రభుత్వానిదే!

రాష్ట్రంలో ఈ ఏడాది వర్షాలు సరిగాపడక పంటలు పండ లేదని, ఇతర రాష్ట్రాల నుంచి పప్పు ధాన్యాలు దిగుమతి చేసుకోవడంతో వాటి ధరలు పెరిగాయే తప్ప, ఈ ధరల పెరుగుదలకు వ్యాపారులు కారణం కాదని ఏపి ఫెడరేషన్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ రాష్ట్ర అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు పప్పులవీధిలోని సుమంగళి కల్యాణ మండపంలో నెల్లూరు జిల్లా వర్తక వాణిజ్య వర్గాల సమాఖ్య ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ధరలు పెరగడానికి వ్యాపారులే కారణం అంటూ ప్రభుత్వం, అధికారులు వ్యాపారులను దోషులను చేయడం సరికాదన్నారు. రాష్ట్రం విడిపోయినప్పటి నుంచే వ్యాపారాలు దెబ్బతిన్నాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రేడ్ గౌరవాధ్యక్షుడు, ఏపి ఆయిల్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, సమాఖ్య జిల్లా అధ్యక్షుడు దాసా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి మంచి కంటి శ్రీనివాసులు, అదనపు కార్యదర్శి సొల్లేటి వెలుగొండయ్య, కోశాధికారి చలువాది వెంకటేశ్వరరావు, సింహపురి వాణిజ్య మండలి అధ్యక్షుడు శ్రీరాం రమేష్, జిల్లా ఆయిల్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాయుగండ్ల వెంకటేశ్వర్లు, వ్యాపారులు పాల్గొన్నారు.

# హెల్మెట్ల పంపిణీ



నెల్లూరు కెవిఆర్ పెట్రోల్‌బంకు సమీపంలో వున్న కెవిఎన్‌ఆర్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఇటీవల తమ కార్యాలయంలో మార్కెటింగ్ సిబ్బందికి నాల్గవ నగర సిఐ సిహెచ్ సీతారామయ్య చేతుల మీదుగా హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎండి ఎల్.ఎఫ్.ఖిల్జీ, మేనేజర్ వి.శ్రీనివాసరావు, నిసార్ అహ్మద్, శ్రీనివాసకుమార్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాజధానికై ఆరాటం

(మొదటి పేజీ తరువాయి)

అంటూ ప్రభుత్వం హడావిడి చేస్తోంది. భారత ప్రధాని నరేంద్రమోడీతో పాటు సింగపూర్ ప్రధానిని, ఆ దేశ యంత్రాంగాన్నంతా కూడా ఆహ్వానించింది. ఇక రాష్ట్రంలోని 16వేల గ్రామాల నుండి మట్టిని తీసుకొచ్చి రాజధాని స్థూపం కట్టాలని చెప్పారు. ఇదేదో సినిమా ఫంక్షన్ అన్నట్లుగా శంకుస్థాపన ఆర్భాటాన్నంతా ప్రైవేట్ ఈవెంట్ సంస్థకు అప్పగించారు. శంకుస్థాపన ఆర్భాటానికి కూడా కోట్లు తగలేయడానికి సిద్ధపడ్డారు. రాజధానికి భూములిచ్చిన రైతులకు చీర, రవిక, పంచె, పసుపు, కుంకుమలిచ్చి శంకుస్థాపనకు స్వాగతిస్తామంటున్నారు. ఇంతవరకు బాగానే వుంది... రాజధానికి భూములిచ్చిన రైతులకు పసుపు, కుంకుమ ఇవ్వడం కాదు, వారి స్త్రీల ముఖాలలో అవి నిండు నూరేళ్ల ఉండేలా చేయండి... రాజధాని ముసుగులో రియల్ వ్యాపారానికి దిగి రైతులకు ద్రోహం చేస్తే ఈ ప్రపంచంలో అలాంటి పాపాత్ములను ఏ దేవుడూ రక్షించడు.

# హోదాకై పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తామన్నా ఈయన వద్దనేటట్లుగా వుంది. హోదా కంటే ప్రత్యేక ప్యాకేజీ వైపుకే ఆయన మనసు లాగుతోంది. అడగాల్సిన వాడే ప్రత్యేకహోదా అడక్కపోతే ఇక కేంద్రం మాత్రం ఎందుకిస్తుంది. ప్రత్యేకహోదా అంశం రాష్ట్ర ప్రజల్లో బలంగానే వుంది. ప్రత్యేకహోదా వస్తే రాష్ట్రానికి పరిశ్రమలు వస్తాయని, ఉద్యోగాలు పెరుగుతాయని, పన్నులు తగ్గుతాయని, వివిధ రూపాలలో రాష్ట్రానికి ప్రయోజనం కలుగుతుందనే అభిప్రాయం ఒక మోస్తరుగా చదువుకున్న వారిలో కూడా వుంది. ప్రత్యేకహోదా కోసం ప్రభుత్వమే ప్రయత్నించని నేపథ్యంలో ప్రతిపక్ష నేతగా జగన్ ప్రత్యేకహోదా సాధనకు శ్రీకారం చుట్టాడు. గుంటూరు వేదికగా నిరాహారదీక్ష పూనాడు. గత నెల 27వ తేదీనే ఆయన దీక్షకు కూర్చోవాల్సి వుండగా ప్రభుత్వం అధికార జులుం చూపించి అడ్డుకోవడం తెలిసిందే! దీనిపై కూడా ప్రభుత్వ తీరుపట్ల ప్రజల్లో నిరసన వ్యక్తమైంది. జగన్ దీక్షతో ఈరోజు ప్రత్యేకహోదాపై ఇతర పక్షాలలో కూడా కదలిక వచ్చింది. ఒక్క తెలుగుదేశం మినహా అన్ని పార్టీలు కూడా రాష్ట్రానికి ప్రత్యేకహోదాను డిమాండ్ చేస్తున్నాయి. జగన్ పోరాటమైతేనేమీ, ఇతరత్రా కారణాల వల్లనైతేనేమీ రేపు కాకున్నా, ఇంకెప్పుడు రాష్ట్రానికి ప్రత్యేకహోదా వచ్చినా జగన్ హీరో, చంద్రబాబు జీరో కావడం ఖాయం.

# బెట్టింగ్‌రాయుళ్ల బెండు తీయండి



కావలి పట్టణంలో సింగిల్ నంబర్, క్రికెట్ బెట్టింగ్‌లు భారీగా జరుగుతున్నాయని, ఇవి కొందరు టిడిపి నాయకుల కనుసన్నల్లో జరుగుతున్నాయని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై స్థానిక టిడిపి నాయకులు, కౌన్సిలర్లు తీవ్రస్థాయిలో స్పందించి బుధవారం డిఎస్పీ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో వచ్చి, ఇలాంటి చట్టవ్యతిరేకమైన చర్యలకు పాల్పడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా, పట్టణ టిడిపి అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాం నుంచే ఈ సింగిల్ నంబర్లు, బెట్టింగ్‌లు జరుగుతున్నాయని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక కొంతమేర తగ్గిందన్నారు. చట్టవ్యతిరేక చర్యలు మీరు చేసి, మాపై రుద్దడం సరికాదని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ స్వచ్ఛమైనదని, అందులోనూ తాము నిజాయితీపరులైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీదా మస్తాన్‌రావుల అడుగుజాడల్లో నడిచే నాయకులమని అన్నారు. 2004 నుంచి పార్టీ అధికారంలో లేకపోయినా కార్యకర్తలకు అండగా నిలబడి నిజాయితీగా పార్టీని నిలబెట్టుకున్నామన్నారు. కనుక, పార్టీలకతీతంగా, చట్టవ్యతిరేక చర్యలపై విచారణ జరిపి, అలాంటివారు ఎంతటివారైనా సరే వదలకుండా చర్యలు తీసుకోవాలని వారు డిఎస్పీని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి అమరా వేదగిరి గుప్తా, నాయకులు గాదంశెట్టి వేణు, ఏఎంసి డైరెక్టర్లు తిరువీధి ప్రసాద్, ఎస్.నారాయణ, జి.రమణయ్య, కిషోర్, కె. రమణయ్యలతో పాటు పలువురు టిడిపి కౌన్సిలర్లు పాల్గొన్నారు.




## కావలి కబుర్లు

## చర్యలు తీసుకుంటాం : డిఎస్పీ రాఘవరావు

కావలి పట్టణంలో సింగిల్ నంబర్, బెట్టింగ్‌లు, జూదం వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలను నిర్వహిస్తున్న కొందరిపై ఇప్పటికే కేసులు నమోదు చేశామని, మిగిలిన వారిని కూడా, పార్టీలకతీతంగా విచారించి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డిఎస్పీ రాఘవరావు స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి సందేహాలు అక్కరలేదని, త్వరలో దోషుల వివరాలను మీడియా ముందు వెల్లడిస్తామని ఆయన అన్నారు.

# రామాయపట్నం పోర్ట్‌కు సానుకూల స్పందన

**- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కందుకూరి వెల్లడి**



నిరుపేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచేందుకు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు రామాయపట్నం పోర్ట్ ఏర్పాటు విషయాన్ని ఇటీవల తాము కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు దృష్టికి తీసుకురాగా, ఆయన ఈ విషయాన్ని కేంద్ర నౌకాయాన, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సంప్రదించారని, ఆయన రామాయపట్నం పోర్ట్, షిప్ యార్డ్‌లను ఏర్పాటు చేసేందుకు సానుకూలంగా స్పందించారని బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు, ప్రకాశం జిల్లా ఇన్‌ఛార్జి కందుకూరి వెంకట సత్యనారాయణ వెల్లడించారు. ఇటీవల ఆయన కావలిలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి ఈ విషయం తెలిపారు. దేశంలో పేద ప్రజల అభ్యున్నతి కోసం బిజెపి నిరంతర కృషి చేస్తోందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఇందులో భాగంగానే రైతుల సంక్షేమం కోసం, ముఖ్యంగా పొగాకు రైతుల అభ్యున్నతి కోసం, లో-గ్రేడ్ పొగాకుకు కేజీకి కేంద్రం వాటాగా రూ. 15, రాష్ట్రం వాటాగా రూ. 5 చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ సమస్యపై ఇటీవల ప్రకాశం జిల్లాలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ దృష్టి కేంద్రీకరించారని, ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల కుటుంబాలను పరామర్శించారని ఆయన అన్నారు. ముద్రా యోజన పథకం ద్వారా ప్రభుత్వం చిరు వ్యాపారులకు రూ.50వేలకు పూచీకత్తు లేకుండా బ్యాంకు రుణాలు అందిస్తుందన్నారు. నిరుపేదలకు సిఎస్‌ఆర్ పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్ సదుపాయాన్ని కల్పిస్తున్నారని, జన్‌ధన్ ఖాతాలు ప్రారంభించి ప్రతి పేదవాడికి బ్యాంకు లావాదేవీలు జరుపుకునే అవకాశం కల్పించిందన్నారు. ఈ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు స్థానిక బిజెపి నాయకులు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో టిడిపితో పాటు బిజెపి కూడా అధికారంలో వున్నట్లుగా గుర్తించాలని, సంక్షేమ పథకాల అమలులో టిడిపి నాయకులు బిజెపి నాయకులను కూడా కలుపుకుని ముందుకు పోవాలని సూచించారు. రానున్న రోజుల్లో బిజెపి మరింత శక్తివంతంగా ఎదుగుతుందని ఆయన అన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



వాయిస్ ఆఫ్ ముస్లిం మైనార్టీ ఆధ్వర్యంలో ఇటీవల కావలి రెడ్‌క్రాస్ భవనంలో, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జాఫర్‌ఖాన్‌కు ఘన సన్మానం నిర్వహించారు. ఇన్‌ఛార్జి ఛైర్మెన్ భరత్‌కుమార్, వాయిస్ ఆఫ్ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు మొగల్ సలీంబేగ్, మాజీ ప్రిన్సిపల్ తదితరులు పాల్గొని ఆయనకు ఘన సత్కారం నిర్వహించారు మాజీ మునిసిపల్ ఛైర్మెన్ శ్రీనివాసకిరణ్, దొడ్ల మనోహరరెడ్డి, ఎం.గోవిందరెడ్డి, దామిశెట్టి సుధీర్‌నాయుడు, జనవిజ్ఞానవేదిక అధ్యక్షులు ఎస్‌కె బాషా, మాజీ కౌన్సిలర్లు ప్రసన్న, కామరాజు, షాషల్, ఆత్మకూరి బ్రహ్మయ్య తదితరులు ప్రసంగించారు. పాత ఊరు మున్సిపల్ పాఠశాలకు క్రీడా వసతి కల్పిస్తామని, జాఫర్‌ఖాన్ వంటి ఉపాధ్యాయులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా వుందని భరత్‌కుమార్ ఈ సందర్భంగా అన్నారు. కేవలం పాఠశాల సిబ్బంది సహాయ సహకారాలతోనే ఈ విజయం సాధ్యమైందని సన్మానసభలో జాఫర్‌ఖాన్ అంటూ, తనను సన్మానించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# రక్తదానం విలువను తెలుసుకోండి

**- సిఐ మంగారావు**




రక్తదానం ఆవశ్యకతను ఉపాధ్యాయులు విద్యార్థులకు బాగా అర్థమయ్యేరీతిలో వివరించి, రక్తదానం పట్ల వారికి అవగాహన కల్పించాలని కావలి టుటౌన్ సిఐ మంగారావు సూచించారు. కావలి రెడ్‌క్రాస్ భవనంలో ఇటీవల ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా, ఉపాధ్యాయులు పాఠశాల స్థాయినుండే విద్యార్థులకు రక్తదానం పట్ల అవగాహన కల్పించి, అందుకు వారి తల్లి దండ్రులను కూడా భాగస్వాములను చేయాలని ఆయన సూచించారు. అనంతరం, ఉపాధ్యాయులు రక్తదానం చేసి, విద్యార్థులతో పాటు ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు కృషిచేస్తామన్నారు.

# వేడుకగా 'స్వచ్ఛ' సాంబమూర్తి 'సంగీత' పండుగ

(మధ్య పేజీ తరువాయి)

## ఏ లోకంలో వున్నా ఆయన ఆనందిస్తుంటారు



- శ్రీమతి శకుంతలమ్మ

ఆయన సంగీతమే ప్రాణంగా బ్రతికారు. ఆ సంగీతమే ఆయనను ఇంతమందిలో బతికిస్తోంది. ఎంతోమంది శిష్యులను చేరదీసి ఆదరించేవారాయన. 9జిల్లాల్లో వున్న ఆయన శిష్యులను ఎంతో ప్రేమగా చూసుకునేవారు. ఈ గౌరవానికి ఏ లోకంలో వున్నా ఆయన అనందిస్తారు అంటూ శ్రీ సాంబమూర్తిగారి సతీమణి శ్రీమతి శకుంతలమ్మ కంటతడిపెట్టారు. "జన్మజన్మలకు ఆయనే (శ్రీ సాంబమూర్తిగారు) నా భర్తగా వుండాలి. ఇట్లాంటి బిడ్డే (ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం) నాకు పుట్టాలని కోరుకుంటాను. ఇంతకంటే నేనేమీ చెప్పలేను".. అంటూ ఆమె గద్గదస్వరంతో అన్నారు. సాంబమూర్తిగారి విగ్రహావిష్కరణ అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ, అందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేకించి ఈ కార్యక్రమ నిర్వాహకులైన శ్రీ గ్రోసు గోపాలయ్యగారికి, వీరిశెట్టి హజరత్‌బాబుగారికీ, ప్రభు గారికీ అందరికీ తమ ఆశీస్సులు అందజేశారు. శ్రీ సాంబమూర్తిగారి శిష్యబృందం అనేక జిల్లాలో వున్నారని, వారందరూ ఎక్కడున్నా అందరూ బాగుండాలని తాను కోరుకుంటున్నాననీ ఆమె చెమర్చిన కళ్ళతో ఆశీర్వదించారు.

## సాంబమూర్తి గారు నెల్లూరుకే గర్వకారణం



- కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు

శ్రీ శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తిగారు నెల్లూరుకే గర్వకారణం. ఆయన నెల్లూరు త్యాగయ్య.. త్యాగమూర్తి, సాంబమూర్తి.. సంస్కృతీమూర్తి. ఆ రోజుల్లోనే సంగీతాభిరుచిని కల్పించి మనందరికీ ఆరాధ్యుడైన సాంబమూర్తిగారి విగ్రహాన్ని ఆవిష్కరించుకున్న ఈ రోజు ఒక సుదినం. నేను చిన్నప్పుడు ఆడుకునే వయసులో సాంబమూర్తిగారిని చూశాను. దండువారివీధిలో ఆయన భిక్షాటనకు వచ్చినప్పుడు ఆయన్ను చూసి ఆయనో హరిదాసేమో అనుకున్నాను. కానీ, ఆ తర్వాత తెలిసింది ఆయన సాంబమూర్తిగారని. ఆ రోజుల్లోనే నెల్లూరుకు దక్షిణ భారతదేశంలోని ప్రముఖు లెందరినో పిలిపించి సంగీతోత్సవాలు నిర్వహించి నెల్లూరుకు మంచి గుర్తింపు తెచ్చారాయన. మనందరికీ ఆరాధ్యుడైన సాంబమూర్తిగారి విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం ఎంతో సంతోషకరం. తండ్రి ఒక మహనీయుడు. తనయుడు భారతదేశంలో సంగీతప్రపంచంలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుని, మనకంటూ, తెలుగువారికంటూ ఒక గుర్తింపు తెచ్చిన గాయకుడు. మీ కృషి మరువలేనిది. చరిత్ర మిమ్మల్ని గుర్తుపెట్టుకుంటుంది. మీకు, మీ కుటుంబసభ్యులందరికీ కూడా గానగంధర్వ సరస్వతి ఆశీస్సులున్నాయి. స్వచ్ఛభారత్ పేరుతో, ప్రధాని మోడీ పిలుపు మేరకు దేశాన్ని పరిశుభ్రంగా వుంచుకోవాలని చేస్తున్న కృషిలో భాగంగా, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నెల్లూరులో ఆ మేరకు అందరికీ ఒక అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఇక్కడ ఆ కార్యక్రమాన్ని కూడా చేపట్టడం అభినందనీయం. అమెరికాలో సైతం తెలుగు తియ్యదనాన్ని తెలుపుతున్నది ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గానం. సంగీతం మంచి ఆరోగ్యప్రదాయిని. కష్టాల్లో నష్టాల్లో, మనసు బాగా లేనప్పుడు సంగీతం ఒక టానిక్‌లా పనిచేస్తుంది. స్వచ్ఛభారతం పేరుతో వారొక గీతం కూడా రూపొందిస్తున్నారు. స్వచ్ఛభారత్ ఒక ప్రజా ఉద్యమం కావాలి. మన శరీరం శుభ్రంగా వుండడమే కాక, మనసు కూడా పరిశుభ్రంగా వుండాలి. స్వచ్ఛంగా వుండాలి. ఒకప్పుడు మనం ప్రపంచానికే విశ్వగురువుగా వున్నాం. ఇప్పుడు కూడా అదే బాటలో పయనించాలి. ఆ కీర్తిని మళ్ళీ మనం పొందాలి. మన భారతీయ సంస్కృతిని, మన వారసత్వ సంపదను మనం పరిరక్షించుకోవాలి. మన సంగీతాన్ని, మన సాహిత్యాన్ని మనం కాపాడుకోవాలి. ఆదికాలం నుంచి పురాణకాలం నుంచి మన సంప్రదాయం మనకు ఆదర్శం. ఆ పాట, ఆ మాట, ఆ బాట మనకు స్ఫూర్తిదాయకం కావాలి. సాంబమూర్తిగారి విగ్రహం పెడితే ఆయనకేమొస్తుంది. మనకొస్తుంది.. స్ఫూర్తి. ఆ స్ఫూర్తిని మనందరం అందుకోవాలి. దేశం గర్వించదగ్గ బహుముఖ ప్రజ్ఞాశాలి కమల్‌హాసన్‌గారు. తెలుగుతనం ఉట్టిపడేలా అనేక చిత్రాలను నిర్మించి చరిత్రలో నిలిచిపోయే మేటి దర్శకుడు కె.విశ్వనాథ్‌గారు. ఇలాంటి ప్రముఖులంతా ఈ కార్యక్రమానికి విచ్చేయడం ఎంతో సంతోషకరం. శివప్రభాత్‌రెడ్డి ('లాయర్' సంపాదకుడు) మనందరినీ ఒకచోటకు చేర్చి, ఇవన్నీ కూర్చి ఇంత మంచి కార్యక్రమం చేపట్టడం ఎంతో సంతోషకరం.

## ఈ కీర్తి అమ్మానాన్నల భిక్షే



- యస్.పి.బాలసుబ్రహ్మణ్యం

నాకు సంబంధించిన ఏ కీర్తి అయినా మా తల్లిదండ్రుల భిక్షే. ప్రత్యేకించి నా భాష, నా నడవడిక, సంగీతపరంగా వచ్చిన గాత్రం అన్నీ నా తండ్రి శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తిగారినుంచి వచ్చినవే. వాస్తవానికి ఈ కార్యక్రమాన్ని నేను చాలా చిన్నదిగా చేయాలనుకున్నాను. నాకు ఇంకొక నాన్నగారు ఘంటసాలగారు. ఆ పక్కనే సాంబమూర్తిగారి విగ్రహం. ఆ విగ్రహాన్ని ఏర్పాటు చేసింది నా సంపాదనతో ఏమీ కాదు. నేనే ఆయన సొత్తు అయినప్పుడు ఆయన విగ్రహం కూడా ఆయన సంపాదనే. అప్పట్లో యనమండ్ర వేంకటేశ్వర శాస్త్రిగారి సహకారంతో మా నాన్న గారు నెల్లూరులో త్యాగరాజ ఉత్సవాలు నిర్వహించారు. చెంబై వైద్యనాథభాగవతార్ వంటి ప్రసిద్ధ సంగీతజ్ఞులెందరో వచ్చి ఇక్కడ గానం చేశారు. ఆ సంగీతవేత్తల సంగీతాన్ని, ఆ రసఝరిని నెల్లూరు వారికి వినిపించాలనే తపనతో ఈ కార్యక్రమాలు చేసేవారు. నాన్న గారు గొప్పగా హరికథలు చెప్పేవారు. సంగీతమంటే ఆయనకు ఎంతో ఇష్టం. జోలెపట్టి సంగీతోత్సవాలు నిర్వహించి ఆదర్శప్రాయులుగా నిలిచారు. ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టాలని అనుకున్నప్పుడు, మా ప్రభు, గోపాలయ్య, హజరత్‌బాబు వీళ్లంతా కలసి, మీరు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని కూడా అనుసంధానం చేస్తే బావుంటుందని సూచించగా, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడుగారిని సంప్రదించాం. ఆయన కూడా అందుకు సంతోషించారు. ఆయన సూచనల మేరకు వెంటనే ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ఐవైఆర్ కృష్ణారావుగారు మా నాన్నగారి విగ్రహం ఏర్పాటుకు జిఓ విడుదల చేశారు. ఇదిగో.. ఈ తల్లి ఈ జానకమ్మ (జిల్లా కలెక్టర్ శ్రీమతి జానకి) అందుకు ఎంతో సహకరించింది. ఇక్కడే వున్నారు.. జిల్లా ఎస్పీగారు (శ్రీ గజరావుభూపాల్) ఎంత సాత్వికంగా వున్నారో ఆయన. వీరివద్దకు నేను వచ్చినప్పుడు, వారు నన్నొక తండ్రిలాగా ఎంతో గౌరవంగా ఆదరించారు. ఇదిగో.. ఇక్కడ ఇంకో పక్క తనకేమీ తెలియనట్లు అమాయకంగా కన్పిస్తున్నారే ఆయన్నే 'ప్రభు' అంటారు. తుంగా శివ ప్రభాత్‌రెడ్డి. తండ్రికి తగ్గ తనయుడు. నాన్నగారి గురించి ఎన్నో సంగతులు వివరిస్తూ లాయర్ వారపత్రిక తరఫున 'ఇదీ సాంబమూర్తిగారి కథ' అనే పేరుతో పుస్తకం కూడా ముద్రించి ఈ కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసి ప్రసంగించిన కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడుగారి వాగ్ధాటి అద్భుతం. ఈ వేదిక మీద వున్న శ్రీ వెంకయ్య నాయుడుగారు, శ్రీ కె.విశ్వనాథ్‌గారు, శ్రీ కమల్‌హాసన్‌గారు వీరంతా ఆయా రంగాల్లో అద్భుతాలు సృష్టించిన మహానుభావులే. ఎందరో మహానుభావులు... అందరికీ వందనాలు. విశ్వనాథ్ గారు నాకు వరుసకు అన్నయ్య అయితే, కమల్ నాకు దేవుడిచ్చిన తమ్ముడు. ఇటీవలే నా సొంత తమ్ముడ్ని కోల్పోయాను, ఆ లోటు నాకు కమల్ తీరుస్తున్నాడు. స్వచ్ఛ భారత్ కోసం సుమారు మూడుమైళ్లు ర్యాలీగా నడచివచ్చిన విద్యార్థులకు, యువతకు, ప్రముఖులకు, అధికారులకు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. మీ మనసు, మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే వుంది. మనం పరిశుభ్రంగా వుండాలి.. మన మనసులు శుభ్రంగా వుండాలి. మన ప్రధాని నరేంద్రమోడీ స్వచ్ఛభారత్ కోసం చేస్తున్న కృషి అమోఘం. ఈ కార్యక్రమాలన్నిటికీ ఎంతగానో సహకరించి ఇంతగా తోడ్పాటునందించిన వారందరికీ నా కృతజ్ఞతలు. వివిధ రాష్ట్రాల నుండి తరలి వచ్చిన నా బాల్యమిత్రులు, పాల్గొన్న రాజకీయ ప్రముఖులు, నెల్లూరు పురప్రజలతో సహా ఎందరో మహానుభావులు... అందరికీ అభివందనములు.

## 'శంకరాభరణం' తొలి శ్రోత మా బాబాయే

- 'కళాతపస్వి' కె.విశ్వనాథ్



శంకరాభరణం చిత్రం కథ బిందు రూపంలో వున్నప్పుడు మొట్టమొదటి శ్రోత మా బాబాయిగారైన శ్రీ సాంబమూర్తిగారే. నేను దర్శకత్వం వహించి, తెలుగు సినిమాల్లో చరిత్ర సృష్టించిన శంకరాభరణం కథను విని ఆశీర్వదించిన తొలి వ్యక్తి ఆయనే. ఆ చిత్ర విజయంతో నేను 'శంకరాభరణం' విశ్వనాథ్ అయ్యాను. మా బాబాయి ప్రోత్సాహం నేను మర్చిపోలేను. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆ లక్షణాలన్నీ పుణికిపుచ్చుకున్న తమ్ముడు బాలసుబ్రహ్మణ్యం, తండ్రిగారి విగ్రహావిష్కరణ చేసి ధన్యుడయ్యాడు.

బాలూ కుటుంబంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనాలనే బాధ్యతతో నేనిక్కడికి వచ్చాను.

"శతమానం భవతి.." అంటూ ఆయన ఈ సందర్భంగా బాలూను ఆశీర్వదించారు.

## మా బంధం అందరి ముందు చెప్పకోవాలని వచ్చా



కమల్‌హాసన్

అందరికీ నమస్కారం. ఇది భాషన్ కాదు.. కన్‌ఫెషన్, ప్రొక్లమేషన్. మనలో మనం మాట్లాడు కునే ఆ నిజం.. మా బంధం అందరి ముందు చెప్పుకోవాలని ఇక్కడికి వచ్చాను. బాలూ తన నాన్నగారైన సాంబమూర్తిగారి గురించి ఎంతో గర్వంగా చెప్పుకునేవారు. అదేవిధంగా నేను కూడా మా అన్నయ్య అయిన బాలూ పేరును అలా గర్వంగానే చెప్పుకుంటాను. సాంబమూర్తిగారు.. నెల్లూరు అంటే అందరికీ తెలుసు. బాలూ ఇండియా అంటే ప్రపంచమంతా తెలుసు. బాలూను నేనెప్పుడూ జ్ఞాపకం పెట్టుకుంటాను. ఆయన నుంచి నేను ఎంతో నేర్చుకున్నాను. ఆయన వినయం.. వినమ్రత అన్నీ.. కానీ.. పాట మాత్రం నేర్చుకోలేకపోయాను.. అంటూ కమల్‌హాసన్ చమత్కరించారు. "నెల్లూరుతోనూ నాకు అనుబంధం వుంది. 50 ఏళ్ళక్రితం ఇక్కడకు వచ్చాను. మా అన్నయ్య వివాహానికి ఇక్కడికి వచ్చా. మా వదిన స్వస్థలం కూడా నెల్లూరే. ఆ విధంగా ఈ వూరితో అనుబంధం వుంది. ఏదేమైనా, బాలూ నాన్నగారి కార్యక్రమం మా నాన్నగారి కార్యక్రమంలా భావించి ఇక్కడికి వచ్చా"నంటూ ఆయన ఈ సందర్భంగా ఎంతో సంతోషం వ్యక్తం చేశారు.

## ఆకట్టుకున్న హరికథాగానం




శ్రీ త్యాగరాజ భిక్షువు, ప్రఖ్యాత హరికథాగాన కళాకోవిదుడు శ్రీ శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తిగారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 4వ తేది రాత్రి నెల్లూరు టౌన్‌హాలులో శ్రీ సాంబమూర్తిగారికి అత్యంత ప్రీతిపాత్రమైన హరికథాగానాన్ని ఏర్పాటు చేశారు. మధురగాన కళానిధి, రాష్ట్ర ప్రభుత్వ హంస అవార్డు గ్రహీత శ్రీ కోట సచ్చిదానందశాస్త్రి పాల్గొని మహారథి కర్ణ' జీవితాన్ని, కర్ణుని దానవైశిష్ట్యాన్ని ఆద్యంతం అద్భుతంగా తన హరికథలో వివరించి ప్రేక్షకుల కరతాళధ్వనులందుకున్నారు. శ్రీ సాంబమూర్తిగారి సతీమణి శ్రీమతి శకుంతలమ్మ, ప్రఖ్యాత సినీ గాయకుడు, శ్రీ సాంబమూర్తిగారి తనయుడు శ్రీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో పాటు, కార్యక్రమ నిర్వాహకులు శ్రీ గ్రోసు గోపాలయ్య, శ్రీ వీరిశెట్టి హజరత్‌బాబు, శ్రీ తుంగా శివప్రభాత్‌రెడ్డి (లాయర్ వారపత్రిక సంపాదకులు)ల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాలకు సహకరించిన వదాన్యులకు, స్వచ్ఛభారత్ కార్యక్రమానికి సహకరించినవారికి అందరికీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంగారి చేతుల మీదుగా ఘనంగా సత్కారాలు చేశారు. అదేవిధంగా, పలువురు హరికథాగాన కళాకారులను కూడా ఆయన సత్కరించారు.

## సాంబమూర్తిగారి విగ్రహానికి 'మా శర్మ' ప్రశంస

నెల్లూరులో భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజస్వామి స్మరణోత్సవాలను నిర్వహించి, నెల్లూరును మరో తిరువయ్యార్‌గా ప్రసిద్ధిలోకి తెచ్చిన మహనీయుడు..త్యాగరాజ భిక్షువు శ్రీ శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తిగారి విగ్రహాన్ని ఇటీవల నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఆయన తనయుడు, విశ్వవిఖ్యాత గాయకుడు శ్రీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నేతృత్వంలో ప్రతిష్టించిన విషయం తెలిసిందే. అయితే, ఆ తర్వాత ఆ విగ్రహాన్ని తిలకించిన ప్రఖ్యాత కొప్పరపు సోదరుల మనుమడు 'మా శర్మ'గారు ఎంతగానో సంతోషిస్తూ, ఆ విగ్రహంలో సాంబమూర్తిగారి ధర్మరూపం కనిపిస్తోందంటూ ప్రశంసించారు. తన ఆనందాన్ని ఆయన స్వయంగా బాలూకి వివరిస్తూ, "ఆదిభట్ల నారాయణదాసులోని ధీరోదాత్తత (వీరత్వం), శ్రీ త్యాగరాజస్వామిలో వున్న భక్తి-శాంతి స్వభావం కలసి శ్రీ సాంబమూర్తిగారు ఒక ధర్మమూర్తిలా కనిపిస్తున్నారంటూ ఆయన ప్రశంసించడం విశేషం.

# సినిమా నా ప్రాణం




సినిమా తన ప్రాణమని, తాను రాజకీయ రంగంలో బిజీగా వున్నా తగినంత తీరిక దొరికితే జనం కోసం మళ్ళీ సినిమాలు తీస్తానని రాజ్యసభ సభ్యులు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జి.వి.అయ్యర్ దర్శకత్వంలో వచ్చిన ఆదిశంకరాచార్య, భగవద్గీత, స్వామి వివేకానంద చిత్రాలను ఒకే డివిడిగా చేసి ప్రముఖ మేధావులకు, పీఠాధిపతులకు, మిత్రులకు ఉచిత బహుమతిగా అందించాలన్నదే తన లక్ష్యమన్నారు. నా చిత్రాల హక్కులను ఎవరికీ ఇవ్వలేదని, ఎన్నో కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన నా చిత్రాలను సామాన్య ప్రజలకు అందించే ప్రయత్నంలో ఉన్నానని చెప్పుకొచ్చారు. 1987లో 'రోటీ కపడా ఔర్ మకాన్' చిత్రం హక్కులు కొని తెలుగు, తమిళ భాషల్లో తీసానని, నశీబ్, సద్, విజయ్, చాందిని, లంహే చిత్రాలను తెలుగులో తీసానని అన్నారు. భగవద్గీత, స్వామి వివేకానందలను హిందీ, తెలుగు, సంస్కృతం భాషల్లో తీసానని, భగవద్గీతకు జాతీయ అవార్డు, స్వర్ణకమలం లభించిందన్నారు. వచ్చే జవహర్‌లాల్ నెహ్రూ జయంతి నాడు వివేకానంద ఇంగ్లీష్ చిత్రాన్ని బాలల కోసం ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

# దొంగ సోదరులను పట్టేసారు

- రూ.7లక్షల విలువగల సొత్తు స్వాధీనం



జల్సాలకు అలవాటుపడి నెల్లూరు నగరంలో పలుచోట్ల చోరీలకు పాల్పడి పోలీసుల కళ్లుగప్పి తప్పించుకు తిరుగుతున్న చోర్‌బ్రదర్స్‌ను మంగళవారం నెల్లూరు మన్సూర్‌నగర్ వద్ద అరెస్ట్ చేసారు. వారి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ గజరావు భూపాల్ నిందితుల వివరాలను వెల్లడించారు. వెంకటేశ్వరపురం జనార్ధన్‌రెడ్డి కాలనీకి చెందిన షేక్ సయ్యద్‌హుస్సేన్, షేక్ అక్బర్ అన్నదమ్ములు. వీరిద్దరు గత కొంతకాలం మన్సూర్‌నగర్‌కు మకాం మార్చారు. ఆటోలు నడుపుతూ వారి సంపాదన జల్సాలకు సరిపోకపోవడంతో దొంగలుగా మారి గత రెండేళ్ళుగా ఇళ్లు, దుకాణాల్లో దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నారు. వీరి కదలికలపై ఒకటవ నగర పోలీస్ ఇన్స్‌పెక్టర్ కె.నరసింహారావు, ఎస్సై కె.రామకృష్ణ నిఘా ఉంచారు. మంగళవారం నిందితులు మన్సూర్‌నగర్‌లో ఉన్నారన్న సమాచారం తెలుసుకుని సిబ్బందితో కలసి నిందితులను పట్టుకుని వారి వద్ద నుంచి తొమ్మిది కేసులకు సంబంధించి రూ. 7లక్షలు విలువగల 41సవర్ల బంగారు ఆభరణాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

### సిబ్బందికి రివార్డులు

నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తు రాబట్టేందుకు కృషి చేసిన ఒకటవ నగర సిఐ కె.నరసింహారావు, క్లూస్‌టీం సిఐ శివారెడ్డి, ఒకటవ నగర ఎస్సై కె.రామకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్స్ ఎస్.ప్రసాద్, ఎం.సుధాకర్‌సింగ్, అల్లాభక్షు, పిటి రామారావు, టి.వేణుకుమార్, పి.శ్రీనివాసులు, ఎస్ నరేష్‌లను ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు. నగర డిఎస్పీ ఎస్.మగ్బూల్, ఒకటవ నగర, ఎస్ఐబి ఇన్స్‌పెక్టర్లు కె.నరసింహారావు, మాణిక్యరావు, ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.

# మంత్రివర్యా... మీకు వందనాలు



నెల్లూరు రూరల్ మండలం మొగళ్ళపాలెంలో 120ఎకరాల స్థలంలో క్రీడాగ్రామం ఏర్పాటుకు కృషిచేస్తున్న కేంద్ర పట్టణాభివృద్ధి శాఖామంత్రి యం.వెంకయ్యనాయుడు ఇటీవల నెల్లూరులో కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న శాప్ ఛైర్మెన్ పి.ఆర్.మోహన్, డైరెక్టర్ యం.రవీంద్రబాబు

# నేదురుమల్లి ఫౌండేషన్ ప్రారంభం



కీర్తిశేషులు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఆస్తులకు, పదవులకే కాదు, ఆయన ఆలోచనలకు సైతం వారసుడిగా ఉండడానికి ఆయన తనయుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ముందుకొచ్చారు. పెద్దాయనగా పిలవబడే జనార్ధన్‌రెడ్డి సుదీర్ఘకాలం రాజకీయాలలో వున్నా తన కొడుకులను రాజకీయంగా తీర్చిదిద్దలేదు. ఆయన చరమాంకంలో మాత్రం రాంకుమార్‌రెడ్డి కొంచెం హుషారయ్యాడు. ఆ హుషారు ఎక్కువై కాంగ్రెస్ నుండి ఇటీవల బీజేపీలోకి జంప్ చేసారు కూడా. తన తండ్రి పేరుతో వెంకటగిరి కేంద్రంగా ఇటీవలే నేదురుమల్లి ఫౌండేషన్‌ను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు సేవలందించడానికి జలరథం, ఆరోగ్య రథం పేరుతో ఒక మంచినీటి ట్యాంకర్‌ను, ఒక అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, మాజీఎమ్మెల్యేలు సాయికృష్ణ యాచేంద్ర, నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు నేదురుమల్లి గుణగుణాలను, ఆయనతో తమకున్న పరిచయాలను చెప్పుకొచ్చారు. తండ్రి అంతటివాడివి కావాలని ఆయన ఆశయాలను పాటించాలని వీళ్లంతా కూడా రాంకుమార్‌రెడ్డికి సూచించారు. జాతీయ రాజకీయాల్లో తనకంటూ ఒక ఖ్యాతి సాధించిన గొప్ప నేతగా నేదురుమల్లిని అభివర్ణించారు. వెంకటగిరి కేంద్రంగా నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి చేస్తున్న ఈ సేవా కార్యక్రమం వెనుక ఎటువంటి రాజకీయ ఉద్దేశ్యముందో తెలియదు కాని, ఆయన మాత్రం తన తండ్రి పేరుతో ఒక మంచి పనికి శ్రీకారం చుట్టాడు. తండ్రికి తగ్గ తనయుడుగా ఎదగాలనుకుంటున్న రాంకుమార్‌రెడ్డికి అభినందనలు.

# ఆ ఊసే ఎత్తడం లేదు





మంత్రివర్గ విస్తరణ జరిగితే తమకు అవకాశముంటుందని ఇటీవల ఎమ్మెల్సీలుగా ఎన్నికైన నాయకులు ఆశ పడుతున్నారు. కాని చంద్రబాబు మైండ్‌లోకి మంత్రివర్గ విస్తరణ ఆలోచన వస్తున్నట్లుగా లేదు. ఆయన ధ్యాస, శ్వాస అంతా కూడా సింగపూర్ లాంటి రాజధాని పేరుతో భూములను తీసుకోవడంపైనే వుంది. ప్రతిరోజూ రాజధాని భూములు, భోగాపురం, బందరు పోర్టు భూముల గొడవ తప్ప పరిపాలన మీద దృష్టి లేదు. పార్టీ బలహీనంగా వున్న జిల్లాల్లో లోటుపాట్లను సరిదిద్దాలనే ఆలోచన కూడా లేదు. మొన్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిస్తే మంత్రి పదవి ఇస్తామని చెప్పి ప్రకాశం జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి నుండి మాగుంట శ్రీనివాసులురెడ్డిని దించారు. ఆయన గెలిచాడు. ఎమ్మెల్సీ ఎన్నికలు కాగానే మంత్రివర్గ విస్తరణ వుంటుందని, మాగుంట శీనయ్య మంత్రి అవుతాడని భావించారు. అయితే, ఇంతవరకు మంత్రివర్గ విస్తరణ జరగలేదు. శీనయ్య మంత్రి కాలేదు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అయిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కూడా మంత్రిత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. అనంతపురం జిల్లాలో పయ్యావుల కేశవ్, చిత్తూరుజిల్లాలో గాలి ముద్దుకృష్ణమనాయుడులు కూడా మంత్రి పదవులపై ఆశలు పెంచుకోగా, చంద్రబాబు మాత్రం వీరి ఆశలకు ఆచరణ రూపమిచ్చేటట్లు లేదు.

# సంజీవయ్య మానవతా దృక్పథం



సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు మంచి వ్యక్తిగా, వినయ విధేయుడిగా, వివాద రహితుడిగా పేరుంది. తన మంచి మనసును మరోసారి చాటుకున్నారాయన. డి.వి.సత్రం మండలం వేణుంబాక గ్రామానికి చెందిన జి.రవీంద్ర విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ కాలేజీలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ఈమధ్య కాలేజీ వెళ్లేందుకు ఆ అబ్బాయి రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న ఆటో గుద్దింది. రవీంద్రకు వెన్నుపూస విరిగింది. అతను మంచానికే పరిమితమయ్యే పరిస్థితి. ఈ సంఘటన గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే సంజీవయ్య స్పందించాడు. ఆ అబ్బాయి ఆయుర్వేద వైద్యానికయ్యే ఖర్చుల కోసం తనవంతుగా 10వేల రూపాయల విరాళాన్ని అందించాడు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com